జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 6 సంచిక - 18 పక్షపత్రిక సెప్టెంబర్ 16-30, 2015



## రిజర్వేషన్లలో సంస్కరణకు సమయమిది


కుల వైరస్ ను
వదిలించుకునేందుకు
యువత కదలిరావాలి!!
STOP CASTEISM
కులతత్వానికి ఆంధ్ర ప్రదేశ్ చిరునామా గా మారింది.
కుల వైరస్, బూజు పట్టిన ఫ్యూడల్ భావాలు , అవినీతి రాజకీయాలకి
వ్యతిరేకంగా యువత ఉద్యమించాలి ...లేకుంటే ఆంధ్ర ప్రదేశ్
వెనుకబాటుతనం లోకి జారిపోతుంది .
IF NOT NOW
NEVER
LOKSATTA PARTY

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక సెప్టెంబర్ 16-30, 2015

సంపుటి - 6 సంచిక - 18

## లోపలి పేజీల్లో...

రిజర్వేషన్లలో సంస్కరణకు సమయమిది...................... 5

రిజర్వేషన్లపై లోక్‌సత్తా పార్టీ విస్పష్ట ప్రకటన................. 9

రిషితేశ్వరి ఆత్మహత్య మన రక్తాన్ని మరిగించాలి........ 11

విద్యను మించిన మతం లేదు...................................... 12

వెలికితీయని సామర్థ్యం నిజమైన పాపం..................... 17

పార్టీల మొసలి కన్నీరు వల్ల రైతుల సంక్షోభం తీరదు... 20

స. హ. వ్యవస్థను ఇరు రాష్ట్రాలూ బలోపేతం చేయాలి........ 23

జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద లోక్‌సత్తా కబడి......... 27

30 వేల ఎకరాలు సమీకరించాక ఇంకా ..................... 28

కలాం కలలకు, రాజకీయానికి మధ్య
అగాధాన్ని అధిగమించటమే అసలైన నివాళి : జేపీ ....... 29

కలాం నూతన భారతదేశం కల నెరవేరటానికి
6 సూత్రాల తక్షణ రాజకీయ, పాలనా సంస్కరణలు..... 30

ఓటుకు కోట్లుపై సీఎం క్యాంప్ ఆఫీస్ వద్ద
లోక్‌సత్తా నిరసన........................................................ 33

జిల్లాలలో కార్యక్రమాలు............................................... 34

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం


బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



# రిజర్వేషన్లలో ఇలా చేస్తే అందరికీ న్యాయం చేయగలం

- MP/MLA/IAS, IPS ఇతర ఉన్నతాధికారులు, డాక్టర్లు, సంపన్న వర్గాలకు రిజర్వేషన్స్ ఎత్తివేయాలి. అప్పుడే అర్హులైన పేదలకు రిజర్వేషన్ ఫలాలు అందుతాయి.
- ప్రతిభ ఉన్న ఏ ఒక్క విద్యార్ధి విద్యార్ధిని పేదరికం వల్ల ఉన్నత విద్యని అభ్యసించే అవకాశం కోల్పోకూడదు.
- OC ల లోని పేద విద్యార్ధులకు మిగతా వాళ్ళతో పోటీ పడేందుకు వాళ్ళకు కొంచెం extra మార్కులు ఇవ్వాలి.




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. ***10*** ,
ఏడాది చందా : రు. ***200***
మూడేళ్ళ చందా : రు. ***500***

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: ***62007167836*** ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.


## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ` 2,500 | |
| పూర్తి పేజీ | ` 5,000 | ` 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ` 10,000 | ` 20,000 |
| బ్యాక్‌పేజి | - | ` 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ` 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ` 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# రిజర్వేషన్లలో సంస్కరణకు సమయమిది

- డా॥ జయప్రకాష్ నారాయణ్



కులం ఆధారిత రిజర్వేషన్ స్కీములో తమను ఓబీసీలు (ఇతర వెనకబడిన వర్గాలు)గా చేర్చాలని గుజరాత్‌లో పటేల్ కులస్తులు (పాటిదార్లు) చేస్తున్న భారీ ఆందోళన రిజర్వేషన్ విధానం తీరుపై కీలక ప్రశ్నల్ని లేవనెత్తుతోంది. శతాబ్దాల తరబడి పుట్టుకతో వివక్షను పాటిస్తున్న పాపపంకిల, కుల సంస్కృతి మనదేశంలో వేళ్లూనుకున్నది. ఈ నేపథ్యంలో సమాజంలో అందరికీ సమానావకాశాల్ని అందించే విధానాలపై చిత్తశుద్ధితో కూడిన లోతైన చర్చను రాజకీయ పార్టీలు, మీడియా, సమాజం చేసిన దాఖలాలు కొన్ని దశాబ్దాలుగా లేవు.

వివక్ష, వ్యవస్థీకృత అసమానతల వల్ల తీవ్ర సవాళ్లను ఎదుర్కోవటం అన్ని సమాజాలలో కనిపిస్తుంది. అమెరికాలో ఆఫ్రికన్-అమెరికన్లు, నేటివ్ అమెరికన్లు (రెడ్ఇండియన్లు) ఉన్నారు. ఐరోపాలో జిప్సీలు, చైనాలో నాన్-హాన్ మైనారిటీలు ఉన్నారు. కానీ పుట్టుకతో అసమానతలు, వివక్ష ఏమాత్రం తప్పు, అనైతికం కాదు, 'మామూలే' అన్నట్టు సమాజం యథాలాపంగా ఆమోదించటం మాత్రం ప్రపంచంలో ఎక్కడా లేనట్టుగా భారతీయ సమాజంలోనే వ్యవస్థీకృతమైంది. వందల ఏళ్లపాటు వందలాది కులాలుగా సమాజాన్ని కృత్రిమంగా విభజించటం, కొద్దిమంది 'పై' కులాలవారికి తప్ప మిగిలిన వారికి చదువును నిరాకరించటం, కులానికి, వృత్తికి మధ్య విడదీయలేని సంబంధాన్ని ఏర్పరచటం, అంటరానితనాన్ని వ్యవస్థలో అంతర్భాగం చేసేయటం, 'మైల' పేరుతో మతిలేని ఆచారాలు, ఉపకులం లోపలే తమ సమూహాల మధ్యే వివాహాలు జరుపుకునే సాంప్రదాయం సుదీర్ఘకాలంగా వేళ్లూనుకుపోవటం, కులాంతర వివాహాల పట్ల గుడ్డి వ్యతిరేకత - ఇవన్నీ భారతీయ కుల వ్యవస్థను అత్యంత హేయమైన, అణచివేత, మూర్ఖత్వం నిండిన పుట్టుకతో వివక్షగా, వ్యవస్థీకృత అసమానతగా తయారుచేశాయి.

మన సమాజాన్ని పైపైన పట్టి చూసినా చాలు - కులానికి, పేదరికానికి మధ్య ఉన్న సంబంధం, కేవలం పుట్టుక నేపథ్యాన్ని బట్టి ఎదిగే అవకాశాలను తిరస్కరించటం - బైటపడతాయి. కుటుంబ ఆర్థిక స్థితి, తల్లిదండ్రుల చదువు, కులం వీటిని బట్టి మన సమాజంలోని అత్యధిక సంఖ్యాక బిడ్డల భవిష్యత్తును దాదాపు చెప్పేయచ్చు. బిడ్డలో దాగివున్న ప్రతిభ, ఆకాంక్ష, కష్టపడే తత్వం వీటికి, ఆమె భవిష్యత్తుకు చాలా సందర్భాలలో సంబంధమే ఉండదు. ఈ ఆధునిక కాలంలో, ఇది కేవలం ఓ అన్యాయం, దారుణమైన అణచివేత మాత్రమే కాదు; ఇలా అవకాశాలను తిరస్కరించటం ద్వారా ఈదేశ అసంఖ్యాక ప్రజల జన్యుశక్తి సంపదను నిర్వీర్యం చేస్తూ దేశంలో పేదరికం, వెనకబాటుతనం నిరంతరం కొనసాగడానికి కారకమవుతున్న వినాశకర వైరస్ కూడా.

ఈ నేపథ్యంలో, వివక్షకు విరుగుడుగా రూపొందించిన రిజర్వేషన్ వంటి విధానాలకు అర్హత నిర్ణయించటానికి కులం ఒక ముఖ్యమైన ప్రాతిపదిక కావాల్సిందే. అయితే, ముందుచూపు లేకుండా రిజర్వేషన్లను అమలుచేసిన తీరు వల్ల అనేక అవాంఛనీయ, విరుద్ధ పరిణామాలు తలెత్తాయి.

రిజర్వేషన్లకు అర్హమైన కులాల్లో రిజర్వేషన్ వల్ల ప్రయోజనాలు కేవలం మెరుగ్గా చదువుకున్న, ఆర్థికంగా స్థిరపడిన వారికి మాత్రమే ఎక్కువగా దక్కాయి. సివిల్ సర్వీసులకు, మెడికల్ కళాశాలలకు, ఐఐటీలు, ఐఐఎంలు, జాతీయ న్యాయ కళాశాలలు లేదా పైకి ఎదిగేందుకు నిజమయిన

అవకాశాన్నిచ్చే ఇతర కోర్సులకు, వృత్తులకు, ఉద్యోగాలకు ఎంపికైన యువత నేపథ్యాన్నే చూస్తే, మనకు ఒక ఒరవడి రూపుదిద్దుకోవటం కనిపిస్తుంది. పేద–ధనిక, చదువులేని–చదువుకున్న అని తేడా లేకుండా ఒక కులంలో అందరికీ సమానంగా రిజర్వేషన్ వర్తిస్తున్నా, విద్య, కెరీర్, డబ్బు పరంగా అప్పటికే ఒక స్థాయికి చేరుకున్నవారికే ఎక్కువ ప్రయోజనాలు దక్కుతున్నాయన్నది వాస్తవం. అత్యుత్తమ సంస్థల్లో ఉన్నత విద్య కావచ్చు, ఉన్నతోద్యోగాలలో రిక్రూట్‌మెంట్ కావచ్చు – వీటిల్లో ఐఏఎస్, ఐపీఎస్, ఇతర సీనియర్ అధికారుల పిల్లలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ఉన్నతస్థాయి రాజకీయ నేతల వారసులు, వివిధ వృత్తుల్లో రాణించిన నిపుణులు, వ్యాపారవేత్తల సంతానం మాత్రమే రిజర్వేషన్లకు అర్హమైన కులాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నారు.

రిజర్వేషన్ ప్రయోజనాలలో ఈరకమైన అసమానతలు లక్ష్యానికి విరుద్ధమైన పరిణామాలకు దారి తీస్తున్నాయి. పేదలు, అవకాశాలు అందని ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు తన కమ్యూనిటీల్లోనే మెరుగైన నేపథ్యమున్న వారి పిల్లలతో పోటీపడలేక, ఎదిగే అవకాశాలు దొరక్క, పేదరికంలో, వెనకబాటుతనంలోనే మగ్గిపోతున్నారు. ఈ అణచివేత వారిలో అపారమైన వేదనను, బాధ, ఆగ్రహాల్ని రగులుస్తూ నిరాశానిస్పృహల్లోకి నెడుతోంది, హింసను ప్రేరేపిస్తోంది. శక్తిసామర్థ్యాలున్నా, ఎంత కష్టపడుతున్నా తమ బతుకులు బాగుపడటం లేదని అవకాశాలు అందని రిజర్వేషన్ వర్గాల పేదలలో ఎక్కువమంది ఆక్రోశం, ఆగ్రహంతో ఉన్నారు. అదేసమయంలో, రిజర్వేషన్ల పరిధిలోకి రాని కులాలవారు రిజర్వేషన్ విభాగంలో ఉన్న వారిని శత్రువుల్లా చూస్తూ అసూయాద్వేషాలను పెంచు కుంటున్నారు. ఎస్సీలు, ఓబీసీల పరిధిలోకి తీసుకురాని కులాల్లో కూడా పేదరికం, తక్కువ చదువు ఉన్న కుటుంబాలు అనేకం ఉన్నాయి. అటువంటి కుటుంబాల నుంచి వచ్చిన బిడ్డలను రిజర్వేషన్ పొందుతున్న సంపన్న కుటుంబం నుంచి వచ్చిన బిడ్డ అధిగమిస్తే, అప్పుడు వారిలో కలిగే ఆగ్రహావేశాలు, ఆవేదన, నిస్పృహ దీర్ఘకాలంలో వినాశకర పరిణామాలవు తున్నాయి. ఈ కులాలవారీ చీలికను, ఓట్ల కోసం చేసే రాజకీయ సమీకరణలు అగాధాలుగా మారుస్తున్నాయి. ఇలాంటి సంక్లిష్టతల్ని ఉపయోగించుకుని, తాత్కాలిక ప్రయోజనాల కోసమే పనిచేసే రాజకీయ నేతలు, కుల నాయకులు తేలిగ్గా ఆటవిక భావోద్రేకాల్ని రెచ్చగొట్టి ఈ దేశాన్ని కులాల కురుక్షేత్రంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో, రాజస్థాన్‌లో తలెత్తిన జాట్లు–గుజ్జర్లు–మీనాల ఆందోళనల గురించి మళ్లీ వివరించనక్కర్లేదు. తాజాగా భారత్‌లో అత్యంత వేగంగా పారిశ్రామికీకరణ, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రంగా గుర్తింపు పొందిన గడ్డ మీద, ఎంతో విజయవంతమైన స్థాయికి ఎదిగి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు మారుపేరుగా ఉన్న పాటిదార్లు చేస్తున్న ఆందోళన రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ తక్షణావశ్యకతని చాటిచెబుతోంది.

ప్రస్తుతం రిజర్వేషన్ల ప్రయోజనాల్లో ఎక్కువశాతం పైస్థాయిలో ఉన్న కొద్దిమంది బాగా చదువుకున్న కుటుంబాలలోని వారికే దక్కుతున్నాయనేది సుస్పష్టం. ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీల్లో నిజమైన పేద కుటుంబాలలో ఎక్కువమంది అవకాశాలు దక్కని స్థితిలోనే ఉన్నారు. మరోవైపు, ఓసీలలో పేదలు ఆక్రోశంతో, నిరాశతో తమ సమస్యలన్నిటికీ రిజర్వేషన్లే కారణమని ఆరోపిస్తున్నారు. ప్రస్తుత రిజర్వేషన్ల విధానం, జీరో–సమ్ దృక్పథం కులాల మధ్య చిచ్చును పెంచుతూ, నిజమైన పేదలు, అర్హత గల పిల్లలకు జీవితంలో ఎదిగే అవకాశాలు అందకుండా చేస్తున్నాయి. ఈ రకంగా – రిజర్వేషన్లలో చేర్చిన కులాల్లో ఉన్నా, రిజర్వేషన్ల బైట ఉన్న కులాల్లో ఉన్నా – అత్యధిక సంఖ్యాక భారతీయులు దగా పడ్డామన్న భావనలో ఉన్నారు. మనకిప్పుడు రిజర్వేషన్ల తీరుపై తక్షణమైన, చిత్తశుద్ధి, నిజాయతీతో కూడిన జాతీయ స్థాయి చర్చ కావాలి, సృజనాత్మకమైన, సునిశితమైన, ఆచరణాత్మకమైన స్పందన కావాలి. అవకాశాలు అందని బిడ్డలందరికీ అవకాశాల్ని అందించటం, సమానత, న్యాయబద్ధత, ఇంగితజ్ఞానం – వీటిని

**రిజర్వేషన్ ప్రయోజనాలలో ఈరకమైన అసమానతలు లక్ష్యానికి విరుద్ధమైన పరిణామాలకు దారితీస్తున్నాయి. పేదలు, అవకాశాలు అందని ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు తన కమ్యూనిటీల్లోనే మెరుగైన నేపథ్యమున్న వారి పిల్లలతో పోటీపడలేక, ఎదిగే అవకాశాలు దొరక్క, పేదరికంలో, వెనకబాటుతనంలోనే మగ్గిపోతున్నారు.**

దిశానిర్దేశాలుగా చేసుకుని మనం మరింత హేతుబద్ధమైన రిజర్వేషన్ల నమూనాను ఆవిష్కరించుకోవాలి.

మొదటిది, రిజర్వేషన్ విధానాల్లో కులాన్ని ప్రధాన ప్రాతిపదికగానే కొనసాగిస్తూనే ప్రయోజనాల్ని కేవలం కులం పేరు తగిలించుకున్న కొద్దిమంది పైస్థాయి కుటుంబాలలోని వారికి కాకుండా, అణగారిన కులాల్లో అవకాశాలు దక్కని అత్యధిక సంఖ్యాక బిడ్డలకు అందించే ఏర్పాటు చేయాలి. ఐఏఎస్, ఐపీఎస్, ఇతర కేంద్ర, రాష్ట్ర సివిల్ సర్వీసులు ఇలా ఒక స్థాయి ప్రభుత్వరంగ ఉద్యోగుల్ని, ప్రస్తుత లేదా మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర సీనియర్ రాజకీయ నేతలు, మంచి ఆదాయం వచ్చే వైద్యులు, ఛార్టర్డ్ అకౌంటెంట్లు, ప్రైవేటు రంగంలో ఒక స్థాయి పైబడిన మేనేజర్లు, కొంత ఆదాయం దాటిన వ్యాపారవేత్తలు తదితరుల్ని రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించాలి (డిస్ రిజర్వ్ చేయాలి). అంటే, రిజర్వేషన్ ద్వారా ఆ కుటుంబాలకు ఒకసారి గణనీయ ఫలితాలు వచ్చాక, ఇక తమ పిల్లలకు అవకాశాల్ని తమంతట తామే సమకూర్చుకోవాలి. తమ సొంత కులాల్లో అవకాశాలు అందని నిజమైన ఆర్తుల పిల్లలకు అవకాశాలు అందించేందుకు పైస్థాయిలోని వారు రిజర్వేషన్ల నుంచి వైదొలగాలి. ఆర్థికంగా, వృత్తిపరంగా ఎదిగినంత మాత్రాన వివక్ష తొలగదని, కాబట్టి రిజర్వేషన్లను నిరంతరం అనుభవించాల్సిందేనని చేసే వాదన మోసపూరితమైనది, వ్యక్తిగత స్వార్థపూరితమైనది. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో విద్య, ఉద్యోగ అవకాశాలు వివక్షను తగ్గిస్తాయన్నదే రిజర్వేషన్ల వెనకనున్న తర్కం. ఈ అవకాశాల్ని కల్పించే శక్తి మాత్రమే ప్రభుత్వానికి ఉంటుంది. విద్య, ఉద్యోగం, ఆదాయం ఇవి వివక్షను తగ్గించకలేకపోతే, ఇక రిజర్వేషన్ ఏర్పాటుకు హేతుబద్ధతే ఉండదు. వివక్షని సమర్థంగా ఎదుర్కోవటానికి, ఎదగటానికి రిజర్వేషన్ తోడ్పడకపోతే, ఐఏఎస్, ఐపీఎస్, ఎమ్మెల్యే, ఎంపీ లేదా గుండె శస్త్రచికిత్సల వైద్యుడు కావటం కంటే మనం ఇంకా జీవితంలో ఏం సాధించగలం? పదవి, హోదా, వృత్తి, విద్య, పిల్లల స్కూలు, ఆదాయం స్థాయిని బట్టి రిజర్వేషన్ వల్ల బాగా లబ్ధి పొందిన కుటుంబాలను తేలిగ్గానే గుర్తించవచ్చు. ఒకసారి ఈ కుటుంబాలను రిజర్వేషన్ పరిధి నుంచి తొలగిస్తే, ఆ కులాల్లో నిజమైన పేదలకు, అవకాశాలు అందుకోలేని వారికి ఉన్నత విద్యలో, ఉద్యోగాల్లో సాయం అందుతుంది.

రెండోది, రిజర్వేషన్ల పరిధిలోకి రాని పేద కుటుంబాలలోని ఆగ్రహాన్ని, ఆకాంక్షల్ని కూడా మనం పరిష్కరించాలి. జాట్లు, పాటిదార్లు, వివిధ రంగాల్లో ఎదుగుతున్న ఇతర కులాల్లో కూడా నిరుపేదలున్నారు. బీదరికంలో బాధపడుతూ, చాలా తక్కువ ప్రమాణాలున్న ప్రభుత్వ పాఠశాలల్లోను, లేదా నాణ్యత లేని కిందిస్థాయి ప్రైవేటు స్కూళ్లలోను చదువుకుంటున్న తమ పిల్లలకి ప్రతిభ ఉన్నా, వారు కష్టపడినా, సంపన్నుల పిల్లల మధ్య, అన్ని హంగులూ ఉండి రిజర్వేషన్ల పొందుతున్న పిల్లల మధ్య నలిగిపోతున్నారన్న కసి ఈ రిజర్వేషన్లు పొందని బీద కుటుంబాలలో రగులుతోంది. వారు తేలిగ్గా ఆగ్రహావేశాలకు లోనవుతారు. కానీ రిజర్వేషన్ కోటాలపై 50శాతం పరిమితి విధిస్తూ సుప్రీంకోర్టు ఆదేశం ఉన్నందున, అంతకుమించి రిజర్వేషన్‌లతో చోటుకల్పించటం సాధ్యం కాదు. అదేసమయంలో, తెలివైన, సృజనాత్మకమైన, న్యాయమైన, ఆచరణసాధ్యమైన రీతిలో ఓసీల్లోని పేద పిల్లలకు ఎదిగేందుకు ఆసరా అందించటం సాధ్యం, అవసరం కూడా. ఉదాహరణకి, తల్లిదండ్రుల చదువు, వారి పిల్లలు వెళ్తున్న పాఠశాల ఈ రెండూ ఆ కుటుంబం పేదరికాన్ని, వెనకబాటుతనాన్ని ఖచ్చితంగా తెలియచెప్పే సూచీలు. తల్లిదండ్రులకు పాఠశాల దాటి చదువు లేకపోతే, ఆ కుటుంబంలోని బిడ్డ ప్రభుత్వ పాఠశాలకో లేదా నామమాత్రపు ప్రైవేటు స్కూలుకో వెళ్తుంటే, సరైన అవకాశాలు అందలేదని తేల్చి చెప్పవచ్చు. అధికారులిచ్చే ఆదాయ సర్టిఫికెట్ల మీద ఆధారపడితే ఏ ప్రయోజనమూ ఉండదు. కోట్లకి పడగలెత్తే కుటుంబాలకి కూడా తెల్లరేషన్ కార్డులు, కాలేజీలలో ఫీజు

**పదవి, హోదా, వృత్తి, విద్య, పిల్లల స్కూలు, ఆదాయం స్థాయిని బట్టి రిజర్వేషన్ వల్ల బాగా లబ్ధి పొందిన కుటుంబాలను తేలిగ్గానే గుర్తించవచ్చు. ఒకసారి ఈ కుటుంబాలను రిజర్వేషన్ పరిధి నుంచి తొలగిస్తే, ఆ కులాల్లో నిజమైన పేదలకు, అవకాశాలు అందుకోలేని వారికి ఉన్నత విద్యలో, ఉద్యోగాల్లో సాయం అందుతుంది.**

మినహాయింపులు అమలవుతున్న సమాజంలో దొంగ సర్టిఫికెట్లు సృష్టించటం చాలా తేలిక. కానీ తల్లిదండ్రుల చదువుని, పిల్లలు చదివే స్కూలుని ప్రాతిపదికలుగా తీసుకుంటే, చాలామేరకు ఆ పిల్లలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల్ని, ఆ కారణంగా విద్యావకాశాలు అందకపోవటాన్ని అంచనా వేయవచ్చు. అటువంటి బిడ్డలు ఎంత ప్రతిభాసామర్థ్యాల్ని కలిగివున్నా, ఖరీదైన ప్రైవేటు స్కూలుకు వెళ్లే ఓ ఉన్నతాధికారి లేదా సంపన్న డాక్టర్ కొడుకుతో పోటీపడలేరు. అయినా, మనం 'మెరిట్' అని చెప్పుకునే వ్యవస్థ ఒక గ్రామీణ పాఠశాలలో పేద పిల్ల సాధించే 80శాతం మార్కులకంటే అన్ని అవకాశాలూ ఉన్న పిల్లాడు సాధించే 90శాతం మార్కులు మెరుగైనవని తీర్మానిస్తుంది! ఓసీ కులాల్లోని అటువంటి పేద పిల్లలకు మార్కుల్లో సహేతుకంగా కొన్ని అదనపు మార్కులు (5 నుంచి 10శాతం) కలిపే ఏర్పాటు చేస్తే –ఈ వెయిటేజీ మార్కుల్ని నిపుణుల బృందం నిర్ణయిస్తుంది– రిజర్వేషన్ కోటాలను పెంచకుండానే పేద ఓసీలకు అదనపు అవకాశాల్ని అందించవచ్చు. అప్పుడు నిజమైన ప్రతిభ విషయంలో కూడా రాజీపడాల్సిన అవసరముండదు. మూడోది, ప్రతిభ ఉండి, ఉన్నత విద్య చదవాలనుకున్న ఏ బిడ్డకూ పేదరికం, పుట్టుక అవరోధం కాకూడదు. స్కాలర్ షిప్పులు, ఉచిత ట్యూషన్, తేలికైన రుణాలు, ఇతర ఏర్పాట్లు అన్నిటినీ సమగ్రమైనరీతిలో పటిష్టపరచాలి. తమ కుటుంబ సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఆకాశమే హద్దుగా బిడ్డలు ఎదగగలగాలి.

ఈ మూడు ఏర్పాట్లనీ చేయటంతోనే రిజర్వేషన్ విధానంలోని అసంబద్ధతలు, అవాంఛనీయతలు చాలామేరకు సమసిపోతాయి. సామరస్యతకపెరుగుతూంటుంది, కుల విద్వేషాల్ని రెచ్చగొట్టి సమాజాన్ని చీల్చే ధోరణులకు ప్రోత్సాహం తరిగిపోతుంది. అన్నిటినీ మించి, తమ ప్రతిభాపాటవాల్ని వికసింపచేసుకోవటానికి నిజమైన అణగారిన వర్గాల బిడ్డలకు సిసలైన అవకాశం లభిస్తుంది. తనలోని శక్తిసామర్థ్యాల్ని వెలికితీసుకునే అవకాశాన్ని ప్రతి బిడ్డకూ ఇవ్వకపోవటం మన సమాజం చేస్తున్న అతి పెద్దపాపం. ఒక్కసారి ఈ పాపాన్ని చాలామేర ప్రక్షాళన చేశాక, ఏటా మనం రిజర్వేషన్లను ఒకటి లేదా రెండు శాతం మేర తగ్గించుకోగలం. పుట్టుకతో వివక్ష అనేది ఒక తరం కాలంలో గతంగా మారిపోతుంది. రిజర్వేషన్ల అవసరమే ఉండదు. అదేసమయంలో, ప్రైవేటు రంగంలో సమానావకాశాలకు తగిన మార్కెట్ చర్యల్ని ప్రభుత్వం చేపట్టటం సాధ్యం. అందుకు ప్రపంచ దేశాలలో చాలా పద్ధతుల్ని పాటిస్తున్నారు.

ఈ ప్రయత్నాలకు తోడు, పాఠశాల విద్య ఫలితాల్ని మెరుగుపరిచేందుకు జాతీయస్థాయిలో ఒక విప్లవంలాగా కృషి జరగాలి. పిల్లలందరికీ నిజమైన అవకాశాల్ని కల్పించటంలో విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఇ) చాలామేర చట్టుబండలైంది. మన ప్రభుత్వ స్కూళ్లలోను, నాసిరకం ప్రైవేటు స్కూళ్లలోను ప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయి. 8వ తరగతిలో 60శాతం మంది పిల్లలకి కనీసం భాగాహారం చేయటం రాదు, 40శాతం

**ప్రతిభ ఉండి, ఉన్నత విద్య చదవాలనుకున్న ఏ బిడ్డకూ పేదరికం, పుట్టుక అవరోధం కాకూడదు. స్కాలర్ షిప్పులు, ఉచిత ట్యూషన్, తేలికైన రుణాలు, ఇతర ఏర్పాట్లు అన్నిటినీ సమగ్రమైనరీతిలో పటిష్టపరచాలి. తమ కుటుంబ సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఆకాశమే హద్దుగా బిడ్డలు ఎదగగలగాలి.**

పిల్లలకి తీసివేత రాదు, 25శాతం పిల్లలకి రెండవ తరగతి స్థాయికి చెందిన ఒక చిన్న పేరాని చదవటం రాదు! 74 దేశాల మధ్య విద్యాప్రమాణాల సర్వేలో మన పిల్లలు 73వ స్థానంలో ఉన్నారు. ఇలాంటి విద్యతో చిన్నారులకి మంచి భవిష్యత్తునందించటం అసాధ్యం.

పాఠశాలల్లో ఖచ్చితమైన ఫలితాలు, పుట్టుకతో, పేదరికంతో సంబంధంలేకుండా నిజమైన నాణ్యమైన విద్యను పొందే అవకాశం ప్రతి బిడ్డకూ అందించటం ద్వారా మాత్రమే న్యాయం, అవకాశాలు, సమత వంటి నిర్దేశిత లక్ష్యాల్ని సమాజం సాధించగలుగుతుంది. రిజర్వేషన్ల సవాలును నిజాయతీగా, అరమరికలు లేకుండా, న్యాయమైన, సృజనాత్మకమైన రీతిలో పరిష్కరించుకోవాల్సిన సమయమిది. ఇసుకలో తలదూర్చి ఉండే ఉష్ట్రపక్షుల్లా వ్యవహరిస్తూ ఎల్లకాలం సవాలు నుంచి తప్పించుకోలేం. మనదేశంలో పుట్టిన ప్రతి బిడ్డకీ ఎదిగే అవకాశాలనివ్వటం కోసం, పుట్టుకతో వివక్షని తొలగించటం కోసం సమగ్రమైన వ్యూహాన్ని అమలు చేయటం ఈనాటి చారిత్రక అవసరం. ■

# ఎన్నికల ఎత్తుగడతో చిత్తశుద్ధి లేని కమిషన్ ప్రతిపాదన

- కాపులకు, బీసీలకు మధ్య చిచ్చుతో కులాల కురుక్షేత్రానికి తెరతీస్తున్న ప్రభుత్వం
- 10 శాతం వెయిటేజీ మార్కులే పరిష్కారం, కులనిర్మూలనకు మార్గం
- రిజర్వేషన్లపై లోక్‌సత్తా పార్టీ విస్పష్ట ప్రకటన

కాపులతో సహా 17కులాలను వెనకబడిన తరగతుల జాబితాలో చేర్చే అంశాన్ని అధ్యయనం చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి లేకుండా రాజకీయ స్వార్ధంతో ఆదరాబాదరాగా ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయటాన్ని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా ఆక్షేపించింది. ఇది రాజకీయ దురుద్దేశంతో, సంకుచితత్వంతో, ప్రజలను వంచించటానికి తీసుకున్న బూటకపు నిర్ణయమని పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. స్వల్పకాలిక రాజకీయ అవసరాల కోసం, కాపులకు, ఇతర వెనకబడిన కులాలకు మధ్య అగాధాన్ని సృష్టించేందుకే ఈ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో కులాల కుంపటిని రగిల్చేందుకు కమిషన్ పేరుతో చేస్తున్న ప్రయత్నాన్ని జేపీ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో తీవ్రస్థాయిలో ఎండగట్టారు.

"కాపు కులస్తులు అణచివేతకు గురయ్యారు, వారిలో వెనకబాటుతనం ఉందనటంలో సందేహం లేదు. తమను వెనకబడిన కులాల జాబితాలో చేర్చాలని వారు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు కూడా. కానీ ఇప్పటివరకూ పట్టించుకోని ప్రభుత్వం, ఇప్పుడు అమాయక ప్రజలను రాజకీయంలో పావులుగా చేస్తూ ఆ అంశాన్ని అధ్యయనం చేయటానికి కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రాన్ని దృష్టిలో పెట్టుకుని, కేవలం రాజకీయ స్వార్ధంతోనే ప్రభుత్వం హఠాత్తుగా ఈ నిర్ణయాన్ని వెలువరించింది తప్ప, వెనకబాటుతనానికి, వివక్షకూ గురవుతున్న ప్రజలకు న్యాయం చేసేందుకు మాత్రం కాదు అనేది సుస్పష్టం" అని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాల, మాదిగల మధ్య, రాజస్థాన్‌లో గుజ్జర్లు, మీనాల మధ్య రగిలిన కులకురుక్షేత్రం తరహాలో ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం కాపులకు, బీసీలకు మధ్య మరో చిచ్చును రగులుస్తుందన్నారు.

వెనకబడిన కులాల్లో, రిజర్వేషన్లలో తమను చేర్చకపోవటం, బీసీ, ఎస్సీ లేక ఎస్టీల వర్గీకరణ పట్ల చాలా కులాల్లో సమంజసమైన అభ్యంతరాలున్నాయని, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, మానవాభివృద్ధి నేపథ్యాన్ని శాస్త్రీయంగా, స్వతంత్రంగా, పక్షపాతరహితంగా, విశ్వసనీయతతో విశ్లేషించి, శాస్త్రీయ ప్రాతిపదికలపై ఆయా కులాల్ని రిజర్వేషన్లకవిభాగంలో చేర్చాలని జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు. అటువంటి అధ్యయనం లేకుండానే మండల్ కమిషన్ కమ్మ, రెడ్డి, తెలగ కులాలను వెనకబడిన తరగతుల జాబితాలో చేర్చిందన్నారు. అశాస్త్రీయంగా చేసే ప్రయత్నం వల్ల తమిళనాడు, కర్నాటకలోలా తమను కూడా చేర్చాలని అన్నికులాల నుంచీ డిమాండ్లు వెల్లువెత్తుతాయన్నారు.

"అటువంటి శాస్త్రీయ అధ్యయనం జరిగేలోపు, పేదకుటుంబాల నుంచి, గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే పిల్లలకు కులంతో పనిలేకుండా విద్యాసంస్థల్లో, ప్రభుత్వోద్యోగాల్లో 10శాతం వెయిటేజీ మార్కులు ఇవ్వాలి. ఉత్తీర్ణ పరీక్షల్లో మొత్తం 1000 మార్కులుంటే, పేద, గ్రామీణ విద్యార్థులకు 100మార్కులు అదనంగా కలపాలి. అప్పుడు వారు కూడా సంపన్న, పట్టణ ప్రాంత విద్యార్థులతో దీటుగా ముందుకెళ్లగలుగుతారు" అని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ సహా అన్ని వృత్తివిద్యా కోర్సుల్లో, ప్రభుత్వోద్యోగాల్లో అన్ని కులాలకీ చెందిన పేద, గ్రామీణ పిల్లలకు ఈ వెయిటేజీ మార్కులు కల్పించటానికి లోక్‌సత్తా పార్టీ కట్టుబడి ఉంటుందన్నారు.

ఈ పరిష్కార సూత్రాన్ని పాటిస్తే, అన్ని కులాలకీ శాశ్వతంగా న్యాయం జరుగుతుంది. వివక్షకి గురయ్యే కుటుంబాల పిల్లలందరికీ ఎదిగే అవకాశాలు వస్తాయి. సుప్రీంకోర్టు ఆదేశించినట్టు రిజర్వేషన్లు 50శాతం మించకుండా అన్ని వర్గాలకీ అవకాశాలు అందించటం సాధ్యమవుతుందని జేపీ పేర్కొన్నారు. ప్రస్తుత రిజర్వేషన్లను కొనసాగిస్తూనే, కులంతో ప్రమేయం లేకుండా అణగారినవారందరికీ దీని ద్వారా న్యాయం అందించవచ్చన్నారు.

కులంతో పనిలేకుండా ప్రతి బిడ్డకూ 12వ తరగతి వరకూ ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలని జేపీ డిమాండ్ చేశారు. అర్హత ఉండి, పై చదువులు కోరుకునే అందరు విద్యార్థులకు కులంతో ప్రమేయం లేకుండా ఉన్నత విద్యను అందించాలన్నారు. అప్పుడే ప్రతిభ, పై చదువులపై ఆసక్తి వున్న అందరు బీద, గ్రామీణ విద్యార్థులకు పూర్తిగా ఎదిగే అవకాశాలు, పోటీలో నిలదొక్కుకునే శక్తి వస్తాయి. "పిల్లలందరికీ, ఉచిత నాణ్యమైన విద్య, అర్హులైన వారికి ఉచిత ఉన్నతవిద్య అందించటం లోక్‌సత్తా పార్టీ రాజకీయ, సామాజిక అజెండాలో ప్రధానమైనవి. అంతిమంగా మన సమాజంలో ఒక తరంలోగా కులనిర్మూలన జరగాలి. కులం, సంకుచితతత్వం లేని సమాజంలో మన పిల్లలు తలెత్తుకుని పెరగాలి. డా॥ అంబేద్కర్ కలల్ని సాకారం చేయాలి" అని జేపీ పేర్కొన్నారు.

ప్రస్తుతం ఏడుశాతం పిల్లలు మాత్రమే ఉన్నత విద్యను చదువుతున్నారని, 93 శాతం పాఠశాల దాటి వెళ్లటంలేదని జేపీ ఆవేదన వ్యక్తంచేశారు. స్కూలు పూర్తిచేసే ఈ ఏడుశాతానికి కూడా నాణ్యమైన చదువు అందటం లేదన్నారు. 11 నుంచి 14 సంవత్సరాల మధ్య 30 శాతం మంది ఏ భాషలోనూ ఒక్క పేరాగ్రాఫ్ కూడా చదవలేరని, 70శాతం భాగహారంలాంటి చిన్న లెక్కలు కూడా చేయలేరన్నారు.

ఎస్సీ,ఎస్టీ విద్యార్థుల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం అడుగడుగునా కన్పిస్తోందని, 'కాగ్' తాజా నివేదిక సూచించినట్టు రూ. 342కోట్లను వారి కోసం ఖర్చుచేయటంలో ప్రభుత్వం విఫలమైందని జయప్రకాష్ నారాయణ్ దుయ్యబట్టారు. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు అన్ని ప్రాంతాల్లో హాస్టళ్లు, పాఠశాలల్ని ఏర్పాటు చేయాలని జేపీ డిమాండ్ చేశారు.

(రిజర్వేషన్లపై 2007, డిసెంబర్ 20న మీడియా సమావేశంలో డా॥ జయప్రకాష్ నారాయణ్ చేసిన విధాన ప్రకటన) ■



# రిషితేశ్వరి ఆత్మహత్య మన రక్తాన్ని మరిగించాలి, కుల వైరస్‌ను వదిలించు కునేందుకు యువత కదలాలి

– జేపీ



ర్యాగింగ్ పేరుతో క్రూర వేధింపుల బారిన పడి ఆచార్య నాగార్జున వర్సిటీ క్యాంపస్‌లో బీఆర్క్ విద్యార్థిని రిషితేశ్వరి ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన మన రక్తాన్ని మరిగించాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ ఘోరంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.


కులం, ప్రాంతం, 'మనం' వర్సెస్ 'వాళ్లు' సంస్కృతితో కళాశాల విద్యార్థులు విషాన్ని చిమ్ముతూ వివక్షల్ని రెచ్చగొడుతున్నారని, సిగ్గుచేటని జేపీ అన్నారు. కులతత్వానికి, వివక్షలకు, పచ్చి అధికార దాహానికి ఆంధ్రప్రదేశ్ చిరునామాగా మారటం బాధాకరమన్నారు. ఓట్ల కొనుగోలు, కులం చుట్టూ తిరిగే ఆటవిక రాజకీయాలు సమాజాన్ని విషతుల్యం చేశాయన్నారు. దోషులకు కఠినశిక్ష విధించటంతోపాటు బలమైన ర్యాగింగ్ నిరోధక చట్టాన్ని తీసుకురావాలని, అయితే అవి మాత్రమే సరిపోవని అన్నారు. కుల వివక్షను వదిలించేందుకు భారీ ప్రజాచైతన్య కార్యక్రమం కావాలన్నారు.

సుసంపన్న సంస్కృతి, చరిత్రతో చైతన్యం తొణకిసలాడే ఆంధ్రప్రదేశ్ ఫ్యూడల్, బరితెగించిన మతిలేని అధికార దాహానికి, అవినీతి రాజకీయాలకు ఆలవాలంగా మారిందని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. కుల వైరస్, బూజుపట్టిన ఫ్యూడల్ భావాలు, అవినీతి రాజకీయాలు, అడ్డూఅదుపూ లేని అధికార, డబ్బు లాలసలకు వ్యతిరేకంగా యువత కదం తొక్కాలని, లేకుంటే ఆంధ్రప్రదేశ్ వెనకబాటుతనంలోకి జారిపోతుందని జయప్రకాష్ నారాయణ్ హెచ్చరించారు. ■

# విద్యను మించిన మతం లేదు

- డా॥ జయప్రకాష్ నారాయణ్

*ఆధునిక భారతదేశ చరిత్రలోనే విశిష్ట సామాజిక పరివర్తనకారుడు నారాయణ గురు 158వ జన్మదినోత్సవం సందర్భంగా (2012) గురుధర్మ ప్రచారణ సభ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శ్రీ నారాయణ విద్యాభవన్, గ్రీన్‌ఫీల్డ్స్, కానాజిగూడ, తిరుమలగిరి, సికింద్రాబాద్‌లో జరిగిన సర్వమత సమ్మేళన సభలో గౌరవ అతిథిగా పాల్గొన్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన ప్రసంగం స్థూలపాఠం...*



మానవత మూర్తీభవించిన మహామనిషి నారాయణ గురు. ఆయన 158వ జన్మదినోత్సవం సందర్భంగా మనందరి తరుపున, మొత్తం భరతజాతి తరుపున నివాళులర్పిస్తున్నాను, అంజలి ఘటిస్తున్నాను.

భారతీయ సమాజాన్ని అసమానతలు, కులతత్వం, అస్పృస్యత, వివక్ష పట్టిపీడిస్తున్నాయని వేల ఏళ్లక్రితమే గుర్తించారు. ప్రధానంగా వివక్షను తొలగించేందుకు, ఒకరకంగా కులతత్వాన్ని నిర్మూలించేందుకు గౌతమ బుద్ధుడు, మహావీర జైనుడు ఎంతో పోరాటం చేశారు. ఆధునిక యుగంలో ఐదుగురు మహనీయులు ఉన్నారు. మహాత్మాజోతిబా ఫూలే 1827లో పుట్టి 1890లో మరణించారు. ఒకరకంగా ఆధునిక భారతీయ సమాజంలో ఈ అసమానతల తొలగింపు కోసం సైద్ధాంతిక పునాది ఏర్పరిచిన వ్యక్తి ఆయన. బాపూజీ 1869లో పుట్టి 1948లో తుపాకీగుళ్లకి బలయ్యారు. కులనిర్మూలన కోసం ఆయన పోరాడలా. కానీ అస్పృశ్యత పోవాలని పోరాడారు. జీవితమంతా పోరాడారు. నమ్మిందే చెప్పి, ఆచరించి చూపారు. గాంధీగారు పుట్టిన పదేళ్లకు 1879లో రామస్వామి నాయకర్ పుట్టారు. ఆయన దేవుడు లేడు, విగ్రహాలు వృధా అని మొత్తాన్నీ తిరస్కరించి కులవ్యవస్థ నిర్మూలించటం కోసం రాజీలేని పోరాటం చేసి 1973లో చనిపోయారు. బాబాసాహెబ్ అంబేద్కర్ 1891లో పుట్టి, కేవలం మతాన్ని సంస్కరించటం చాలదు, రాజ్యాన్ని సంస్కరించాలి అనే లక్ష్యంతో ఒక బలమైన, మతాతీతమైన రాజ్యవ్యవస్థకు పునాది వేసి వివక్షలేని సమాజం సృష్టి కోసం ఒక రాజకీయ సిద్ధాంతాన్ని అందించారు. 1956లో అంబేద్కర్ మరణించారు. ఆయన పోయిన ఏడాదే నేను పుట్టింది. కానీ వాళ్లెవరూ సాధించలేని నిజమైన విజయం కేవలం పూజ్య నారాయణ గురు సాధించారు. అందుకే భారతీయ చరిత్రలో మనమంతా గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి నారాయణ గురు. మిగతావాళ్లు ఆయనకి ఏమాత్రం తగ్గకుండా చాలా ఉదాత్తమైన ఆశయాల్ని, ఆలోచనలను, ఆర్తిని, జీవితంలో పోరాటాన్ని, త్యాగాన్ని చూపారనటంలో సందేహం లేదు. కానీ కేవలం నారాయణ గురు మాత్రమే ఆయన చుట్టూ ఉన్న సమాజంలో తన జీవితకాలంలో సంపూర్ణంగా మార్పు తేగలిగారు. ఈదేశంలో ఆ అదృష్టం ఆ కాలంలో నారాయణ గురుకి, ఇటీవలికాలంలో కొంతమేర పాండురంగ శాస్త్రి అథోల్ (స్వాధ్యాయ ఉద్యమం)కే దక్కింది. పాండురంగ శాస్త్రి అథోల్ కొంకణ, గుజరాత్ తీరప్రాంతంలో కొన్నివేల గ్రామాలలో మౌలికమార్పులకు కోసం కృషి చేసి విజయం సాధించారు. కానీ నారాయణ గురు సాధించిన స్థాయిలో విజయం కాదది. నారాయణ గురు ఒక రాష్ట్రాన్ని, ఒక పెద్దసమాజాన్ని ప్రభావితం చేశారు.

ఎందుకని కేవలం నారాయణ గురుకి మాత్రమే అంత విజయం సాధ్యమైంది? భారతీయ సమాజంలో మౌలికమార్పులు తేవాలన్న కోరిక, తపన మనకు బలంగా ఉంటే బహుశా నారాయణ గురు జీవితం నుంచి, ఆయన బోధనలు, ఆయన ఆచరణ నుంచి ఎంతో నేర్చుకోవచ్చు.

నారాయణ గురులో ఉన్న అసాధారణ విషయం...ద్వేషాన్ని పూర్తిగా జయించటం! ఒక వికృతమైన సమాజంలో వివక్షకు గురై, నిరాదరణకు గురై, గుండెల్లో ఎంత కోత, బాధ ఉన్నా ద్వేషాన్ని పూర్తిగా జయించి ఆయన ప్రేమను పంచగలిగారు. ఒక ఉద్యమం దీర్ఘకాలికంగా మనగలగాలి అంటే, ఒక జాతి మొత్తాన్నీ ప్రభావితం చేయాలి అంటే, సమాజం మొత్తాన్నీ మార్చాలి అంటే మొట్టమొదట ఖచ్చితంగా ద్వేషాన్ని జయించవలసిందే, ప్రేమను పంచవలసిందే. అది లేకుంటే ఎంత బలమైన భావనలైనా కూడా ఆ మనిషి ఉన్నంతకాలం, ఆ మనిషి నడుస్తున్నంత కాలం, ఆ చుట్టూ మనకు కొంత స్ఫూర్తి నిస్తుంటాయిగానీ అవి తరతరాలుగా మన జీవితాల్ని ప్రభావితం చేయలేవు, జాతిని మార్చలేవు.

ఇంకోటి, మతాన్ని నారాయణ గురు ఆధునికీకరించారు. హి సెక్యులరైజ్డ్ ది రెలీజియన్. అదో అసాధారణ ప్రయోగం. ఆయన మతాన్ని మనిషి నుంచి దూరంగా తీసుకుపోలేదు. మనిషి చుట్టూ తిప్పారు. ఆయన భాషంతా, మన మతం ఏదైనా, మనకు మతమే లేకున్నా, మనం దేవుడ్ని నమ్మినా, నమ్మకపోయినా మనందరం హాయిగా మాట్లాడుకునేలా ఉంది. ఆయన మాటలు ఏ సంకోచం లేకుండా వాడ గలిగిన భాష. ఆయన వాక్యాల్ని మళ్లీమళ్లీ చదివా. ఎక్కడైనా వాడటానికి సిగ్గుపడాల్సి వస్తుందా అని పరిశీలించా. ఈ సమాజంలోనేకాదు, అమెరికా, ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, లాటిన్ అమెరికా ఇలా ప్రపంచంలో ఏ మూలైనా ఆ భాషను వాడటానికి మానవతవున్న ఏ మనిషికీ సిగ్గుపడాల్సిన అవసరం లేదు. సంకోచం అక్కర్లేదు. అంతగా మతాన్ని నారాయణ గురు ఆధునికీకరించారు.

పెద్దలు, విజ్ఞులు అయిన మతాచార్యులు ఉన్నారు. కానీ శతాబ్దాలకాలంగా మతాలు ఛాందసవాదాన్ని పెంచి పోషించాయి. ఇటీవల కొంతమేర మతాలు మనుషుల్లో ఆలోచనను పెంచే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ ఫలానా కులస్తులు, మహిళలు జ్ఞానబోధల్ని వింటే వారి చెవుల్లో సీసం పోశారు. బైబిల్ విషయంలో కూడా అలానే జరిగింది. అందుకే మార్టిన్ లూథర్‌కింగ్ రావలసి వచ్చింది. మతాలు కొంతమంది మతాచార్యుల సొత్తులుగా, కేవలం వారి ఆదేశాలను పాటించే భీరువులుగా, సామాన్యులుగా ప్రజలు ఉన్నారు. అందుకు పూర్తి భిన్నంగా నారాయణ గురు తొలినుంచి విద్య, విద్య, విద్య అని ఎలుగెత్తి చాటారు. విద్య నుంచి స్వేచ్ఛ, విద్య ద్వారా స్వేచ్ఛ అని నిరంతరం చెప్పారు. జ్ఞానాన్ని పెంచకుండా భక్తుల్ని తయారుచేస్తే అది రిచ్యువల్ అవుతుంది తప్ప ధర్మం కాదని చెప్పారు.

**పెద్దలు, విజ్ఞులు అయిన మతాచార్యులు ఉన్నారు. కానీ శతాబ్దాలకాలంగా మతాలు ఛాందసవాదాన్ని పెంచి పోషించాయి. ఇటీవల కొంతమేర మతాలు మనుషుల్లో ఆలోచనను పెంచే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ ఫలానా కులస్తులు, మహిళలు జ్ఞానబోధల్ని వింటే వారి చెవుల్లో సీసం పోశారు. బైబిల్ విషయంలో కూడా అలానే జరిగింది.**

ఈ మూడు కోణాల్ని ఆయన ధార్మికచింతనతో కలపటం వల్లే కేరళ సమాజాన్ని, ఈళవ కులస్తుల్ని అస్పృశ్యత నుంచి ఒకతరం కాలంలో బైటికి తీసుకొచ్చి ఆత్మస్థయిర్యాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచి విద్యను అందించారు. దేశచరిత్రలో నారాయణ గురు ద్వారా తప్ప మరెక్కడా ఇలాంటి గొప్ప విజయం సాధ్యం కాలేదు. అది కేవలం ఈళవ కులస్తులకే పరిమితంకాలేదు. కేరళ సమాజం మొత్తాన్నీ మార్చింది. ఇప్పటికి కూడా కేరళ గురించి మాట్లాడగానే దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే అక్కడ వైశిష్ట్యం ఉందని ఎందుకు భావిస్తున్నాం అంటే, అక్కడి విద్య, ఆరోగ్యం, ఆలోచన మానవ విలువలు, మానవ హక్కులు, ప్రజాస్వామిక దృక్పథాలు గురించి ఎందుకు మాట్లాడుకుంటున్నాం అంటే కొందరు చెబుతున్నట్టు ఈ పార్టీ, ఆ పార్టీ కారణం కాదు. అది కేవలం నారాయణ గురు జీవితం, ఆయన చేపట్టిన కార్యక్రమాలు, ఆయన ప్రభావితం చేసిన సమాజం వల్లే సాధ్యమైంది. అందుకే కేవలం మొక్కుబడిగా పెదవుల మీద నుంచి కాకుండా గుండె లోతుల్లో నుంచి మీ అందరి తరుపునా నారాయణ గురుకి అంజలి ఘటిస్తున్నాను.

**చాలా క్లుప్తంగా నాలుగు అంశాలు.**

మతాచార్యులు, పెద్దలు దయచేసి ఆలోచన చేయాలి.

ఇప్పుడు కూడా మతం ప్రభావం కోట్లాదిమంది మీద ఉంది. ఆ మతం ప్రభావాన్ని మంచి మార్గం కోసం వినియోగించకపోతే కోట్లాదిమంది నష్టపోతారు.

మొట్టమొదటిది, విద్య. నారాయణ గురు జీవితమంతా పరితపించింది అందుకే. నాకు నిజంగా దేవుడున్నాడో లేదో తెలియదు. దాని గురించి ఆలోచన కూడా చేయను. గౌతమ బుద్ధుడు చెప్పినట్టుగా దేవున్నాడో లేదో తెలియదు, మనిషి ఉన్నాడు, అనవసర కష్టాలున్నాయి, అంతకుమించి దేవుడు అనవసరం. దేవుడున్నా నన్ను గురించి పట్టించుకునేదాకా దేవుడి గురించి పట్టించుకోకూడదని నిర్ణయించుకున్నాను. మ్యూచ్యువల్ నాన్‌ఇంటర్‌ఫియరెన్స్. కానీ పాపం ఉందని నేను పూర్తిగా నమ్ముతాను. దేవుడున్నా లేకున్నా ఖచ్చితంగా పాపం ఉన్నది. ప్రపంచంలో అతిపెద్ద పాపం– అన్‌ఫుల్‌ఫిల్డ్ పొటెన్షియల్. ఒక బిడ్డకు ప్రకృతి ప్రసాదించిన ప్రతిభాపాటవా లుంటే, వాటిని బైటికితీసే ప్రయత్నాన్ని సమాజం చేయకపోతే, కేవలం ఫలానా తల్లిగర్భంలో పుట్టిన కారణంగా నా జీవితం ఇట్లా అయిపోయిందని కన్నీళ్లు కార్చే పరిస్థితి ఉంటే ఒక సమాజంగా మనమంతా పాపం చేస్తున్నట్టు లెక్క.

**మొట్టమొదటిది, విద్య. నారాయణ గురు జీవితమంతా పరితపించింది అందుకే. నాకు నిజంగా దేవుడున్నాడో లేదో తెలియదు. దాని గురించి ఆలోచన కూడా చేయను. గౌతమ బుద్ధుడు చెప్పినట్టుగా దేవున్నాడో లేదో తెలియదు, మనిషి ఉన్నాడు. అనవసర కష్టాలున్నాయి, అంతకు మించి దేవుడు అనవసరం. దేవుడున్నా నన్ను గురించి పట్టించుకునే దాకా దేవుడి గురించి పట్టించుకోకూడదని నిర్ణయించుకున్నాను.**

ఆ తర్వాతది, నివారించదగ్గ కష్టం. నివారించలేనివాటికి మనం ఏమీ చేయలేం. కానీ రోడ్డు మీద ప్రమాదాలలో నష్టపోవటం, టీకాలు అందకపోవటం వల్లో అంగవైకల్యం, రోగాలబారిన పడటం వంటివి జరుగుతుంటే అంతకంటే పాపం ఇంకోటి లేదు. ఈవేళ ఈ రెండు పాపాలూ భరతజాతిని దహించివేస్తున్నాయి. ఇక్కడ స్కూలులో ఉన్న సుమారు 700మంది పిల్లలకు కులమతాలకు అతీతంగా మంచి భవిష్యత్తునిచ్చే చదువును అందించే ప్రయత్నం చేస్తున్నారు. సంతోషం. కానీ ఇదే గడ్డ మీద, ఇదే హైదరాబాద్‌లో అసంఖ్యాక బిడ్డలకి ఎందుకని మంచి చదువు అందటం లేదు? ఈవేళ లక్షలమంది రెక్కాడితేగానీ డొక్కాడనివారు, రోజు కూలీలు తమ శక్తికి మించి పిల్లల చదువుకు ఖర్చు చేస్తున్నారు. మరోపక్క ప్రభుత్వం రకరకాల పథకాల పేరుతో వేలకోట్లు ఖర్చుచేస్తున్నట్టు ప్రకటిస్తోంది. కానీ నిజాయతీగా, గుండెమీద చేయి వేసుకుని చూస్తే, నూటికి 80మందికి మనదేశంలో సరైన చదువు అందటం లేదు. వారి శక్తిసామర్థ్యాలు బైటపడటం లేదు. ఇది కఠోర వాస్తవం. ప్రైవేటు, ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యతా ప్రమాణాలు అలా ఉన్నాయి. ఇటీవలే ప్రపంచవ్యాప్తంగా 64 దేశాల మధ్య 74 ఎంటిటీలలో చదువుల తీరుపై, చదవటం, రాయటం, అంకగణితం వంటి చిన్నచిన్న అంశాలపై ఆ దేశాల భాషలలోనే పరీక్ష పెట్టారు. భారతదేశం అట్టడుగు నుంచి రెండవ స్థానంలో ఉంది. మనకంటే దిక్కుమాలిన కజిగిస్థాన్ అనే దేశం లేకపోతే మనం అట్టడుగున ఉండేవాళ్లం. ఈ దేశంలో అద్భుతమైన విద్య ఉంది, అపారమైన శాస్త్రవిజ్ఞానం గల లక్షలాది మంది ఉన్నారనటం అబద్ధాలాడటం, మనల్ని మనం మోసం చేసుకోవటమే. నూటికి పదిమందికో, పదిహేనుమందికో కాస్త విద్య అందితే అది విద్య కాదు. నూటికి 80మందికి వారి శక్తిసామర్థ్యాలు, ప్రతిభాపాటవాలు వెలికిరావటంలా. వారందరి సామర్థ్యం పూర్తిస్థాయిలో వికసించేలా సరైన చదువును అందించటం ద్వారా మాత్రమే నారాయణ గురుకి నివాళిని అందించే అర్హతను మనం పొందగలం.

దయచేసి మతాచార్యులు, ఏమతానికి ఆ మతంలో, ప్రతి కుటుంబం గుండెలలో ఈ మాటల్ని ప్రవేశపెట్టండి. రాజకీయంలో ఉన్నవారిని, అధికారులను ఈ విషయంలో నిలదీయండి. దేశాన్ని దోచేవారు, లంచాలు మింగేవారు, హత్యలు చేసేవారు కూడా మీ కాళ్లు పట్టుకోవటానికి మీ దగ్గరకు వస్తున్నారు. వాళ్లందరికీ కాస్తంత గడ్డి పెట్టండి, కాస్తంత బుద్ధి పెట్టండి. అరేయ్, నీకేమన్నా బుద్ధి ఉంటే ఒక అధికారి కాగానే,

ఒక నాయకుడు కాగానే ప్రతి బిడ్డకూ చదువు అందించే ఏర్పాటు చేసి నా దగ్గరికి రా. అప్పుడు దేవుడు నిన్ను క్షమిస్తాడు. లేకుంటే నిన్ను క్షమించడు అని నిర్మొహమాటంగా చెప్పండి. మతానికి అర్థం మార్చండి. కేవలం ఫలానా తల్లి గర్భాన పుట్టిన కారణంగా ఈ దేశంలో పుట్టిన బిడ్డకి సరైన చదువు అందే అవకాశం లేదంటే, ఏ దేవుడ్ని గురించి మాట్లాడతాం మనం? ఏ మతం గురించి మాట్లాడతాం? ఎవరి తప్పు ఇది? మతం అంటే విద్యను మించి, విద్యకు అతీతమైనదని భావిస్తే మీరు పాపం చేస్తున్నారని బహిరంగంగానే చెబుతున్నాను. దయచేసి ఈ సమాజానికి ఈ మాట చెప్పండి. ఈ బుద్ధి తీసుకురండి. కేవలం కొంతమంది పిల్లలు చదివితే చాలదు, ప్రతి బిడ్డ సామర్థ్యం బైటపడాలి.

రెండోది, నారాయణ గురు జీవితమంతా వివక్షలేకుండా ప్రతి బిడ్డా ఎదిగేలా చేసేందుకు పాటుపడ్డారు. ఈవేళ మనం చేస్తున్నదేమిటి? ఈశాన్య భారతంలో ముస్లిలన్న కారణంగా బంగ్లాదేశ్ నుంచి వచ్చారన్న ఆరోపణలతో ఊచకోత కోయటానికి ప్రయత్నిస్తున్నాం. వాళ్లు బంగ్లాదేశ్ నుంచి చొరబడినవారు కారు. వారిలో 90శాతంమంది ఎప్పుడో 1920లలో అప్పటి బెంగాల్ నుంచి వచ్చినవాళ్లు. అక్కడ తేయాకు తోటలలో పనికి మనుషులు కావాలంటే వచ్చిన వాళ్లు. పోనీ బంగ్లాదేశ్ నుంచే వచ్చారని అనుకుందాం. పొట్టకూటి కోసం కష్టపడి పనిచేయటం కోసం, చాలా కృత్రిమంగా ఏర్పాటుచేసిన సరిహద్దుల్ని దాటి వస్తే నిన్న మొన్నటిదాకా మన బిడ్డల్ని, మన అన్నదమ్ముల్ని ఈవేళ ఊచకోత కోస్తామా? సరే, అక్కడ తప్పు జరిగింది. భారతదేశంలోని మిగిలిన చోట్ల హైదరాబాద్, బెంగళూరు, కోచి వంటి చోట్ల నుంచి వాళ్లు బిక్కుబిక్కుమంటూ రైళ్లలో టికెట్లు కూడా లేకుండా పశువుల్లా కిక్కిరిసిన రైళ్లలో పారిపోయే పరిస్థితి కల్పిస్తామా?... ఎక్కడ దేశం? ఎక్కడ సమాజం? ఎక్కడ మతం? ప్రపంచంలోని ఎల్లలు తొలగిపోవాలి మొర్రో అని ఒకపక్కన అంటుంటే, ఈదేశంలోనే ఈ మతం, ఈ భాష, ఈ ప్రాంతం అంటూ అక్కడ్నుంచి ఇక్కడికొస్తే నేనూరుకోను, ఇక్కడ్నుంచి ఎక్కడికైనా వెళ్తే భయపడుతూ బతుకుతాను అనే వాతావరణాన్ని సృష్టిస్తే ఇంక మతమేంటి? భయాన్ని తొలగించి, స్వేచ్ఛగా ఎక్కడైనా తలెత్తుకుని బతికే ధైర్యాన్ని ఇవ్వకపోతే ఆ విద్య ఎందుకు? ఎందుకీ మతం? ఎందుకీ విద్య? మతాచార్యులు ఈ విషయాల గురించి మాట్లాడతారని చాలా ఆశించాను. ఎప్పుడైనా మాట్లాడితే, నా మతంలోని వారికి ఏదైనా జరిగిందని మాట్లాడినవాళ్లే తప్ప నా దేశంలోని పౌరులకు జరిగిందని మాట్లాడిన వాళ్లు లేరు. వేరే మతంవారికి నష్టం జరిగితే ఫర్వాలేదా? ఎంత సంకుచితం చేసుకుంటున్నాం ఈ సమాజాన్ని? ఇది పిల్లలకు, పెద్దలకు అర్థం కావాలి– దక్షిణాసియాలో ఎక్కడ, ఏ కులంలో, ఏ మతంలో పుట్టినా వాళ్లంతా కూడా మన మనుషులే అని గుర్తించకపోతే, వాళ్లందరి ఆర్థికాభివృద్ధి మనందరి ఉమ్మడి అవసరం అని గుర్తించకపోతే, వాళ్లు ఎక్కడున్నా వాళ్లకు హక్కులున్నాయి అని గుర్తించి గౌరవించకపోతే ఈ దేశానికి, జాతీయతకి, మన సంస్కృతీసంప్రదాయాలకి, మతానికి అర్థం లేదు. నారాయణ గురు తన కాలంలో పరిస్థితులకనుగుణంగా అస్పృశ్యత మీద పోరాడాడు. కానీ ఈవేళ కులం, మతం, భాష, ప్రాంతం పేరుతో విద్వేషాలను పెంచుతుంటే, రాజకీయం దానిని ఓటుబ్యాంకులుగా మలుచుకుంటుంటే, ప్రజలలో చిచ్చుపెట్టటమే రాజకీయ చతురత అవుతుంటే ఎందుకని మతాచార్యులు గొంతువిప్పటం లేదు?

**ప్రపంచంలోని ఎల్లలు తొలగిపోవాలి మొర్రో అని ఒకపక్కన అంటుంటే, ఈదేశంలోనే ఈ మతం, ఈ భాష, ఈ ప్రాంతం అంటూ అక్కడ్నుంచి ఇక్కడికొస్తే నేనూరుకోను, ఇక్కడ్నుంచి ఎక్కడికైనా వెళ్తే భయపడుతూ బతుకుతాను అనే వాతావరణాన్ని సృష్టిస్తే ఇంక మతమేంటి? భయాన్ని తొలగించి, స్వేచ్ఛగా ఎక్కడైనా తలెత్తుకుని బతికే ధైర్యాన్ని ఇవ్వకపోతే ఆ విద్య ఎందుకు? ఎందుకీ మతం? ఎందుకీ విద్య?**

మూడోది, ప్రతి మతం చెప్పేది మనిషిలో కాస్తంత నమ్రతను పెంచుకోవాలని. మనిషికున్న వనరుల్ని, శక్తిని పదిమంది మంచికోసం ఉపయోగించాలని. ఒక్కసారి హైదరాబాద్ నగరంలో పెళ్లిళ్లు చూడండి మతాచార్యులూ.

ఎంతెంత ఖర్చు పెడుతున్నారో చూశారా? సామాన్య ప్రజల్ని అవమానిస్తున్నారే, మనకి జీవితం మొత్తంలో వనరుల్ని కలిపినా కూడా వాడి పెళ్లి ఖర్చు ముందు మనం తూగమే?! ఆ రకంగా అంగరంగ వైభవంగా పెళ్లిళ్లకు ఖర్చు పెట్టి, దుబారా ఖర్చు చేసి, వాళ్ల అహంకారాన్ని చూపెట్టి మనల్ని అవమానిస్తున్నారే, కించపరుస్తున్నారే?! జాతివనరుల్ని వృధా చేస్తున్నారే?! ఈ వృధాని అరికట్టాలి. మనిషి సంపాదించటం తప్పుకాదు. సమాజంలో నీతివంతంగా, ప్రజలకు సేవలందించి సంపాదిస్తే అది మంచిదే. నిజమైన సంపద సృష్టి చాలా పవిత్రమైన కార్యక్రమం. కానీ దోచుకున్న డబ్బును ఆడంబరంగా ఖర్చుపెట్టి ఆ రూపంలో తమ ప్రభను పెంచుకునే ప్రయత్నం చేస్తే, సమాజాన్ని కర్కశంగా అపహాస్యం చేస్తుంటే, ఏదోకరకంగా కోట్లు సంపాదిస్తేనే గొప్పవాళ్లం, ధర్మానికి, న్యాయానికి నిలబడితే నేను ఎందుకూ పనికిరాని వాడ్ని అనే భావాల్ని చిన్నారుల మనసులలో నాటుతుంటే ఏం మతం? ఏం కులం? ఏం సమాజం? నాకీ పెళ్లిళ్లకు వెళ్లాలంటే గుండెలవిసిపోతున్నాయి. ఈ సమాజంలో ఉంటూ ఈ మాటలు చెబితే పిచ్చివాళ్లు అంటారని మౌనం వహించి ఇంట్లో కూర్చోవాల్సి వస్తోంది. మతాచార్యులూ! ఆదర్శవంతమైన, నిరాడంబరమైన జీవితాల్ని సమాజానికి అందించే ప్రయత్నం చేయండి. ఈ సమాజంలో అందరికీ చెప్పండి. మీరు సరైన మార్గంలో ఎంతైనా డబ్బు సంపాదించండిగానీ నిరాడంబరంగా బతకండయ్యా, వృధా ఖర్చు అరికట్టటండయ్యా, ఇతరులను అవమానించేట్టు కాకుండా సమాజానికి మేలుచేసేట్టు మీ డబ్బుకు ధర్మకర్తలా వ్యవహరించండయ్యా అని చాటిచెప్పండి. అప్పుడే మతం గురించి మాట్లాడే అర్హత వాళ్లందరికీ ఉంటుంది గానీ, మతం పేరు చెప్పి మతాచార్యుల వద్దకు వస్తే వారిని గౌరవించటం చాలా హీనసంస్కృతి. తప్పనిసరి పరిస్థితి కాబట్టే ఈవేళ చాలా పరుషంగా మాట్లాడాల్సి వస్తోంది.

నాలుగోది, మతాన్ని నిరంతరం ఆధునికీకరించాలి. మతం అంటే జాతుల మధ్య పోరాటాలుగా, ఒకరి మీద ఒకరికి ద్వేషాన్ని పెంచే ఏర్పాట్లతో ఉంటే ఒకరి వేళ్లతో మరొకరి కళ్లు పొడుచుకుని లోకమంతా చీకటి అవుతుంది. కాబట్టి మతాన్ని తర్కంవైపు నడిపించండి. ఈరోజు ఇంటర్నెట్, మొబైల్‌ఫోన్‌లు వంటి సాంకేతిక విజ్ఞానం వల్ల ప్రపంచానికి ఎల్లలు చెరిగిపోయాయి. అజ్ఞానాన్ని అంతం చేయటానికి పూర్వం ఎన్నడూ లేని అవకాశాలు ఇప్పుడు మనకున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే మతాన్ని ఆధునికీకరించటంతోపాటు మతాన్ని తార్కికం చేయవచ్చు.

**సమాజంలో నీతివంతంగా, ప్రజలకు సేవలందించి సంపాదిస్తే అది మంచిదే. నిజమైన సంపద సృష్టి చాలా పవిత్రమైన కార్యక్రమం. కానీ దోచుకున్న డబ్బును ఆడంబరంగా ఖర్చుపెట్టి ఆ రూపంలో తమ ప్రభను పెంచుకునే ప్రయత్నం చేస్తే, సమాజాన్ని కర్కశంగా అపహాస్యం చేస్తుంటే, ఏదోకరకంగా కోట్లు సంపాదిస్తేనే గొప్పవాళ్లం, ధర్మానికి, న్యాయానికి నిలబడితే నేను ఎందుకూ పనికిరాని వాడ్ని అనే భావాల్ని చిన్నారుల మనసులలో నాటుతుంటే ఏం మతం? ఏం కులం? ఏం సమాజం?**


తర్కానికి మతం అతీతంగా భావించి తర్కం లేనిదల్లా మతం అంటే అన్యాయమవుతుంది. తర్కానికి అందని అంశాలున్నాయి, వాటిని గురించి పట్టించుకుంటే అంగీకరించవచ్చుగానీ, తర్కాన్ని తిరస్కరించటమే మతం అంటే ఒప్పుకోను. అలాంటి మతాన్ని తిరస్కరించాలి. మతాన్ని తార్కికం చేయండి.

కాబట్టి, ఈ నాలుగు అంశాల కోసం.... అందరికీ నాణ్యమైన విద్య, దక్షిణాసియా, ఆ మాటకొస్తే, మనకింకా ఓపిక ఉంటే ప్రపంచంలోని ఏ మనిషి పట్ల వివక్ష చూపకుండా అంతరాల్ని, ఎల్లల్ని దాటి గౌరవించే సంస్కృతి, సంస్కారాల్ని ప్రదర్శించటం, అందుకుతగ్గ ఏర్పాట్లను మాటలలో కాకుండా చేతలలో చేయటం, ఆడంబరాలతో కోట్లాదిమందికి అవమానాల్ని పంచిపెట్టే సంస్కృతికి స్వస్తిచెప్పి డబ్బుకు ధర్మకర్తలుగా వ్యవహరించే, సంపదసృష్టి మాత్రమే సంపదకు మూలంగా భావించే సమాజాన్ని నిర్మించటం, మతాన్ని ఆధునికీకరించటం, తార్కికం చేయటం కోసం మతాచార్యులు తమ విస్తృత వనరుల్ని, ప్రభావాన్ని ఉపయోగించాలి. ఆ నిజమైన ఆధ్యాత్మిక మార్పు కోసమే ఇంత నిష్కర్షగా మాట్లాడాను. ■

# వెలికితీయని సామర్థ్యం నిజమైన పాపం

- డా॥ జయప్రకాష్ నారాయణ్

దేవుడున్నాడో లేడో నాకు తెలియదు. కానీ పాపం ఉందని మాత్రం నేను నమ్ముతాను. అన్నిటికంటే పెద్దపాపం వెలికితీయని సామర్థ్యం. దేవుడో, ప్రకృతో ప్రసాదించిన అంతర్లీన ప్రతిభాపాటవాలను విద్య ద్వారా సంపూర్ణంగా వికసింపచేసుకుని ఎదిగే అవకాశాన్ని ఒక బిడ్డకు సమాజం ఇవ్వకపోతే, అది ఖచ్చితంగా క్షమార్హంకాని మహాపాపం. ఈ కొలమానంతో చూస్తే, భారతదేశం అత్యంత పాపపంకిలమైన దేశం.



విద్యారంగంలో బోలెడు విజయాల్ని సాధించామని జబ్బలు చరుచుకునే దేశం గురించి ఇలాంటి వ్యాఖ్య చేయటం వింతగానూ, అనుచితంగానూ అన్పించవచ్చు. మనకు మన సత్యా నాదెళ్లలు, ఇంద్రా నూయిలు ఉన్నారు. మనకు మన ఐ.ఐ.టిలు, ఐ.ఐ.ఎంలు ఉన్నాయి. మనకు మన విద్యాహక్కు చట్టం (ఆర్.టి.ఇ) ఉంది. దాదాపు దేశంలోని పిల్లలందరూ పాఠశాలల్లో పేరు నమోదు చేసుకున్నారంటూ 96శాతం ఎన్‌రోల్‌మెంట్‌ని చూపుతున్నాం. ఇంకేంటి మన విద్యావ్యవస్థలో లోపం?

వాస్తవాల కోసం సాక్ష్యాల్ని పరీక్షించాలి. ఏటా చేసే సర్వేలను మదింపు చేసి ప్రథమ్ అనే స్వచ్ఛంద సంస్థ వార్షిక విద్యా నివేదిక స్థితి (ఎ.ఎస్.ఇ.ఆర్-అసర్) పేరుతో పాఠశాల విద్యపై 2005 నుంచి విలువైన వివరాలను వెల్లడిస్తోంది. భారత్‌లోని 600కి పైగా జిల్లాల్లో గ్రామీణ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల విద్యార్థులను సర్వే చేసి ఈ నివేదికల్ని రూపొందిస్తారు. ఏయేటికాయేడు అసర్ సర్వే వివరాలు మరింత నిక్కచ్చిగా, నిరుత్సాహకరంగా ఉంటున్నాయి. ఉదాహరణకి, 2013 సర్వేలో ఐదవ తరగతిలో ఉన్న 53శాతం మంది పిల్లలు, ఎనిమిదవ తరగతిలోని 26శాతం మంది పిల్లలు కనీసం రెండవ తరగతి స్థాయి పేరాగ్రాఫ్‌ని చదవలేకపోయారు. నిజానికి, ప్రభుత్వ పాఠశాలల్లోని ఐదవ తరగతి పిల్లల్లో రెండవ తరగతి స్థాయి పేరాగ్రాఫ్‌ని చదవగలిగే పిల్లల సంఖ్య 2009 నుంచి 2013కొచ్చేసరికి 50.3 నుంచి 41.1 శాతానికి పడిపోయింది. ప్రయివేటు స్కూళ్లలో ఈ పరిస్థితి కొద్దిగా మెరుగ్గా 63శాతం వద్ద నిలకడగా ఉంది. అంకగణితం విషయానికొస్తే, 8వ తరగతి చదువుతున్న గ్రామీణ పిల్లల్లో 54శాతం మంది మూడంకెల సంఖ్యను ఒక అంకెతో భాగాహారం చేయలేకపోతున్నారు. 30శాతం మంది పిల్లలు ఒక రెండంకెల సంఖ్య నుంచి మరో రెండంకెల సంఖ్య తీసివేతను చేయలేకపోతున్నారు. ఇక్కడా ప్రయివేటు స్కూళ్లే కాస్త మెరుగ్గా ఉన్నాయి. అయితే ఉండాల్సిన ప్రమాణాలు వాటిల్లోనూ లేవు. ప్రభుత్వ, ప్రయివేటు బడులు రెంటిలోనూ చదువు దిగజారుతోందని తేలింది. ఐదవ తరగతిలో భాగాహారం లెక్క చేయగలిగిన పిల్లల సంఖ్య 2009, 2013 మధ్యకాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 36 నుంచి 21 శాతానికి, ప్రయివేటు స్కూళ్లలో 46 నుంచి 39శాతానికి దిగజారింది. విద్యాహక్కు చట్టం ఈ పరిస్థితుల్ని ఏమాత్రం మార్చలేకపోయింది.

ఇక ఇతర దేశాల్లోని పిల్లలతో భారతీయ పిల్లలు ఏమేరకు పోటీపడగలుగుతున్నారో కూడా చూద్దాం. 74 దేశాల మధ్య 15 ఏళ్ల పిల్లలకు 'పీసా' (ప్రోగ్రాం ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్‌మెంట్) పేరుతో 2009లో ఒ.ఇ.సి.డి నిర్వహించిన సర్వేలో భారతదేశం 73వ స్థానంలో నిలిచింది. ఈ సర్వేలో భాగంగా పిల్లల్ని భాష, గణితం, సైన్సు, తర్కంలో పరీక్షించారు. షాంఘై-చైనా, సింగపూర్, హాంకాంగ్-చైనా వరసగా మొదటి

మూడు స్థానాల్లో నిలిచాయి. మనదేశం కంటే అధ్వాన్నంగా చివరిస్థానంలో నిలిచింది కిర్గిజిస్థాన్ అనే దేశం మాత్రమే. ఈ సర్వేపై భారత ప్రభుత్వ స్పందన చూస్తే కోపం కంటే ముందు నవ్వొస్తుంది. చిన్నపిల్లలాటలోలాగా ఇక ముందు ఒ.ఇ.సి.డి సర్వేలో పాల్గొనబోమంటూ తిరస్కరించింది. మన పిలల్ని ప్రపంచంతో పోటీపడకుండా, ఇతరులతో బేరీజు వేసుకోకుండా చేస్తే, ఇక మనం మనకు గొప్ప విజయాలున్నాయనే నమ్మకంలోనే, విఫలమైన పాత విధానాల మధ్యే ఆత్మానందం పొందుతుంటాం.

బోలెడంత హంగామాతో 2009లో విద్యాహక్కు చట్టాన్ని (ఆర్.టి.ఇ) తీసుకొచ్చారు. గత పదేళ్లుగా సర్వ శిక్షా అభియాన్ కింద పాఠశాలల మౌలిక వసతులు, ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచేందుకు గణనీయమైన సంఖ్యలో ప్రజాధనాన్ని (రూ. 2,86,000 కోట్లు) ఖర్చుపెట్టారు. ఏటా రూ. 11,000 కోట్లతో సర్కారీ బడుల్లో మధ్యాహ్న భోజన పథకం ఉంది. వీటికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వాలు బడి చదువు మీద ప్రతీ సంవత్సరం భారీ మొత్తాల్ని (సుమారు రూ. 2,00,000 కోట్లు) ఖర్చు చేస్తున్నాయి. ఇంత చేసినా, ఫలితాల్ని చూస్తే దిగ్భ్రాంతి, నిస్తేజం కలుగుతాయి. 2007-08 నుంచి నేటికి ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదవ తరగతి వరకు పిల్లల నమోదు 9 శాతం పడిపోయింది (13.37 కోట్ల నుంచి 12.19 కోట్లకి). ఇదేసమయంలో ప్రయివేటు పాఠశాలల్లో పిల్లల నమోదు 40 శాతం మేర పెరిగి 5.09 కోట్ల నుంచి 7.12 కోట్లకు చేరింది.

**ప్రయివేటు స్కూళ్లలో పిల్లల సంఖ్య పెరగటం వల్ల మనకు మంచి విద్య అందదు. బోధనా ఖర్చుల కోసం జేబుల్లో నుంచి పెడుతున్న ఖర్చుతో చాలా కుటుంబాలు పేదరికంలోకి కూరుకుపోతున్నాయి. అంత త్యాగం చేసినా, చాలామంది పిల్లలకు అర్థవంతమైన పాఠశాల చదువు అందటం లేదు.**

సర్కారీ బడుల్లో ఉన్న పిల్లలు దాదాపు అందరూ పేద కుటుంబాల నుంచే వచ్చారనేది ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ప్రయివేటు పాఠశాలల్లో ఇటీవల పెరిగిన 40శాతం మంది పిల్లలూ ఆ పేద కుటుంబాల నుంచీ వచ్చినవారేనని గణాంకాలు చెబుతున్నాయి. పేద తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు బడుల్లో చేర్చి జేబులో నుంచి ఫీజులు కడుతున్నారు.

ప్రయివేటు రంగాన్ని నీరుగార్చే ప్రత్యేక లక్ష్యంతో కనిపించే ఆర్.టి.ఇ ఆచరణలోకి వచ్చేసరికి పాఠశాల విద్యలో లైసెన్స్ రాజ్యాన్ని తయారుచేసింది. దాదాపు అసాధ్యమనిపించే మౌలిక వసతుల నిబంధనల్ని ప్రయివేటు రంగంపై విధించి భారీమొత్తంలో నిధుల్ని ప్రభుత్వ రంగంలోకి కుమ్మరించింది. కానీ ఫలితాల్ని నిగ్గు తేలిస్తే, ఆర్.టి.ఇ ఉన్నప్పటికీ లక్షలాది పేదకుటుంబాలు తమ ఆదాయాల స్తోమతుకి మించి భారీ డబ్బుని వెచ్చించి తమ పిల్లల్ని ప్రయివేటు స్కూళ్లలో చేరుస్తున్నారు. పనికొచ్చే చదువు మీద దృష్టి పెట్టని ఆర్.టి.ఇ నిజానికి చేసిందేమిటంటే అన్ని రకాల పరీక్షల్నీ నిషేధించటం. పాఠశాలల మధ్య పోటీని, నచ్చిన స్కూల్‌ని ఎంపిక అవకాశాన్ని పెంపొందించకుండా ఆ చట్టం ప్రభుత్వ గుత్తాధిపత్యాన్ని సృష్టించే ప్రయత్నం చేసింది. దానివల్ల చివరికి జరిగిందేమిటంటే, పేదపిల్లలు ప్రయివేటు రంగం వైపు మళ్లటం, మొత్తంగా విద్యావ్యవస్థలో ఫలితాలు ఇంకా దిగజారటం.

ఇటువంటి నిరాశాకరమైన పరిస్థితిలో నాణ్యమైన విద్యకు గట్టి డిమాండ్ ఉండటం, తమ పిల్లల కోసం ఎంత త్యాగానికైనా తల్లిదండ్రులు సిద్ధపడుతుండటం గొప్ప ఆశాజనకమైన పరిణామం. అయితే కేవలం ప్రయివేటు స్కూళ్లలో పిల్లల సంఖ్య పెరగటం వల్ల మనకు మంచి విద్య అందదు. బోధనా ఖర్చుల కోసం జేబుల్లో నుంచి పెడుతున్న ఖర్చుతో చాలా కుటుంబాలు పేదరికంలోకి కూరుకుపోతున్నాయి. అంత త్యాగం చేసినా, చాలామంది పిల్లలకు అర్థవంతమైన పాఠశాల చదువు అందటం లేదు. ఫలితంగా, ఎక్కువమంది 'చదువుకున్న' యువతీ యువకుల్లో ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగానికి కావలసిన కనీస నైపుణ్యాలు ఉండటం లేదు. గోతులు తవ్వటం, గుంతలు పూడ్చటంతో మనుషులకు ఆదాయాన్ని పెంచే ఉపాధిని కల్పిస్తున్నామని మనం ఈ ఇరవయ్యొకటవ శతాబ్దపు ప్రపంచంలో ఎల్లకాలం నటించలేం. తక్కువ స్థాయి నైపుణ్యాలతో మన ఉత్పాదకత, వేతనాలు కూడా చాలా తక్కువగానే కొనసాగుతాయి. పేదరికం మన కోట్లాదిమంది ప్రజల జీవితాల్ని ఛిన్నాభిన్నం చేస్తూనే ఉంటుంది. నాణ్యమైన పాఠశాల విద్య, నైపుణ్యాలు మాత్రమే పేదరికాన్ని నిర్మూలించి అధిక ఆర్థికాభివృద్ధి రేటును సాధించగలిగినవి. మంచి విద్య నైతికావసరం మాత్రమే కాదు, కీలక ఆర్థికావసరం కూడా!

ప్రతి బిడ్డకూ నిజమైన నాణ్యతతో కూడిన విద్య గ్యారంటీగా అందేలా చేయటానికి ఏం చేయాలి? పాఠశాల చదువులో ఫలితాలను మెరుగుపరచటానికి ఇప్పుడు ఆర్.టి.ఇ

ఒక పెద్ద అవరోధంలా మారింది. ఈ చట్టం విద్యార్థుల పరిజ్ఞానాన్ని అర్థవంతంగా అంచనా వేయటానికి, పిల్లల మీద ఒత్తిడి లేకుండా విద్యాప్రమాణాలను పరీక్షించటానికి, ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం మధ్య తల్లిదండ్రులు నచ్చిన పాఠశాలని ఎంపిక చేసుకోవటానికి, పేద తల్లిదండ్రులకు ప్రభుత్వమే ఫీజు రీఇంబర్స్ చేయటానికి అవకాశం లేకుండా చేసింది. అయ్యవారిని చేయబోతే ఏదో అయిందనే సామెతకు తాజా నిదర్శనం ఆర్.టి.ఇ. విద్యలో నిజమైన ఫలితాలు వచ్చేలా ఈ చట్టాన్ని సవరించాలి, సంస్కరణల్ని జోడించాలి.

ఆర్.టి.ఐ ఒక అవరోధంగా కాకుండా బలాన్నిచ్చేదిగా, సహాయకారిగా మారాక, ప్రతి బిడ్డకూ తక్కువ ఖర్చుతో నిజమైన చదువు అందేలా ఇంగితజ్ఞానంతో కూడిన విధానాలను, కార్యక్రమాలను రూపొందించుకోవాలి. భారత్‌లోని మూడో వంతు పిల్లలు బాగా చదువు, ఆదాయమున్న కుటుంబాలలోని వారు, పెద్దస్థాయి ప్రయివేటు స్కూళ్లకి వెళ్తూ తమ భవిష్యత్తును తామే చూసుకోగలిగినవారు అనుకుందాం. అప్పుడు మిగిలిన పిల్లలకు విద్య కోసం ప్రభుత్వ వనరులు సమస్య కావు. చదువులో నాణ్యతే అసలైన సవాలవుతుంది. పాఠశాల చదువులో ప్రతి బిడ్డ మీదా ప్రభుత్వం ఇప్పుడు రూ.20,000 - రూ.25,000 ఖర్చు చేస్తోంది. ఫలితాలు బాగుంటాయని అందరూ మెచ్చుకునే ప్రభుత్వ కేంద్రీయ విద్యాలయాల్లో ప్రతి బిడ్డకూ రూ.27,000 ఖర్చు పెడుతున్నారు. కాబట్టి మనం పెద్ద ఎక్కువగా అదనపు ఖర్చుచేయకుండానే విద్యలో నాణ్యతను పెంచవచ్చు.

రెండు కీలక ఏర్పాట్లు చేసుకుంటే విద్యలో ఖచ్చితంగా మెరుగైన ఫలితాల్ని సాధించగలం. మొదటిది, అర్థవంతమైన అంచనా పద్ధతులు, ఫలితాలను లెక్కకట్టటానికి విజయాన్ని నిర్వచించి చెప్పటానికి ఒత్తిడి లేని పరీక్షలు. తల్లిదండ్రులకి, ఉపాధ్యాయులకి, పాఠశాల యాజమాన్యాలకి అందరికీ పిల్లల విజయం కావాలి. పరీక్షల్ని నిషేధించటం ద్వారా ఆర్.టి.ఇ ఇప్పుడు 'విజయాన్ని' పరిగణలోకే తీసుకోవటం లేదు. మనకు పరీక్షలు ఉంటే, అవి దాదాపు ప్రతిసారీ ఒత్తిడిని పెంచేవిగా, బట్టీపట్టి వల్లె వేసేవిగా, కాపీ కొట్టేందుకు పురికొల్పేవిగా ఉంటున్నాయి తప్ప వాటిలో సృజనాత్మకత, జీవితంలో అన్వయానికి చోటు ఉండటం లేదు. అర్థవంతమైన పరీక్షలు, అంచనా విధానాన్ని ప్రవేశపెట్టి ఒక నిరంతరాయ కార్యక్రమంలా అమలుచేస్తే ఫలితాలు గణనీయంగా పెరుగుతాయి.

ఇక రెండో ఏర్పాటు, నచ్చిన పాఠశాలను ఎంపిక చేసుకునే అవకాశాన్ని తల్లిదండ్రులకు కల్పించేలా ప్రభుత్వ - ప్రయివేటు పాఠశాలల మధ్య పోటీని ప్రోత్సహించటం. కొన్ని ప్రమాణాలను పాటిస్తూ ఏడాది ఫీజు రూ.18,000 వరకూ ఉండి మంచి విద్యనిచ్చే అన్ని ప్రయివేటు స్కూళ్లనీ ప్రోత్సహించాలి. వీటిలో లాభాపేక్షలేని వాటికి ప్రాధాన్యమివ్వాలి. అన్ని పాఠశాలల మధ్యా తమకు నచ్చిన స్కూలును ఎంపిక చేసుకునే అవకాశం తల్లిదండ్రులకివ్వాలి, ఫీజుని ప్రభుత్వమే భరించాలి. ఫలితాల్ని జాగ్రత్తగా పర్యవేక్షించటమే ప్రధానంగా ప్రభుత్వ పాత్ర కావాలి. బడికెళ్లటం ఆర్థికభారంకాకుండా ప్రతి బిడ్డకూ రవాణా రాయితీని కూడా అందించాలి. ఇప్పటికి కూడా, కోట్లాదిమంది పేద పిల్లలు ప్రయివేటు స్కూళ్ల కోసం దూరప్రాంతాలకు వెళ్లివస్తున్నారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని అర్థవంతంగా అంచనా వేయటం, నచ్చిన పాఠశాలను ఎంచుకునే అవకాశం ఒకసారి విద్యారంగంలో వేళ్లూనుకుంటే, ఫలితాల్లో మౌలిక మార్పు కనిపిస్తుంది. నూటికి 65 పాఠశాలల్లో 50 కంటే తక్కువమంది పిల్లలు, ఇద్దరు మాత్రమే అధ్యాపకులు ఉండి, స్కూళ్లు వెలవెలబోతున్నాయి. వాటి స్థానంలో స్కూళ్ల సంఖ్యని తగ్గించి ప్రతి స్కూలులోను 100-150కి తక్కువ కాకుండా పిల్లలు, ఐదుగురికి తక్కువ కాకుండా అధ్యాపకులు, ఇతర సదుపాయాలు ఏర్పరిస్తే ఇప్పటి ఖర్చుతోనే మరింత మంచి విద్య అందుతుంది. దీంతోపాటు సరైన ఉపాధ్యాయ శిక్షణ, స్వయం ప్రతిపత్తిగల జిల్లా విద్యాబోర్డుల ద్వారా అత్యధిక జవాబుదారీతనంతో ప్రక్రియ మరింత బలపడుతుంది.

భారతదేశం ఇప్పుడు సరైన మార్గం కోసం ఎదురుచూస్తున్న సంధి దశలో ఉంది. మన బిడ్డలకు నిజమైన విద్యను, నైపుణ్యాల్ని అందించి సంపదను సృష్టించే శ్రమశక్తిని తయారుచేయటానికి మనకిదో అపురూప అవకాశం. ఇది మన యువజనాభా బలాన్ని సాకారం చేస్తుంది, మనదేశానికి ఆర్థిక దిగ్గజ స్థానాన్ని అందిస్తుంది. మాకు చదువు కావాలీ అని సమాజంలోని అన్నివర్గాలలో ఉన్న బలమైన డిమాండ్‌ను అవకాశంగా మలచుకుని కొద్దిపాటి అదనపు ఖర్చుతోనే విద్యారంగంలో సమూల మార్పుని సాధించవచ్చు. ఎప్పుడో రావాల్సిన విప్లవానికి ఇప్పుడు సమయం పరిపక్వమైంది. ■

# విధానాల్ని సమూలంగా మార్చటం ద్వారా తప్ప పార్టీల మొసలి కన్నీరు వల్ల రైతుల సంక్షోభం తీరదు : జేపీ



మీడియాతో మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ. చిత్రంలో హైమా, పాండురంగారావు, శ్రీనివాస్

రైతుల సంక్షోభానికి పాలకుల పాపమే తప్ప ప్రకృతి శాపం కారణం కాదని, వ్యవసాయ విధానాల్ని సమూలంగా మార్చటంతోపాటు విద్య, ఆరోగ్యం, రైతులకందించే కనీస సేవల్లో అవినీతి లేకుండా యంత్రాంగాల్ని ప్రక్షాళన చేయటం ద్వారా తప్ప మొసలి కన్నీరు కార్చే రాజకీయం వల్ల రైతుల జీవితాలు బాగుపడవని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కేవలం ఒక్క సీజన్‌లో వర్షం పడకపోతేనే రైతులు దయనీయస్థితిలోకి వెళ్లిపోయారంటే అది వ్యవసాయరంగం పట్ల అన్ని పార్టీల ప్రభుత్వాలూ అనుసరించిన దుర్మార్గపు ఓటు బ్యాంకు విధానాల వల్లేనన్నారు. లోపభూయిష్టమైన మౌలిక వసతులు, పరపతి విధానాలకుతోడు నీటి యాజమాన్యం, నీటి పారుదల, డ్రెయిన్లు సక్రమంగా లేకపోవటం వల్ల వర్షం కురవకపోయినా, కురిసినా కూడా రైతులు తట్టుకోలేని పరిస్థితిని కల్పించారన్నారు. వ్యవసాయ నష్టాలతో పాటు పిల్లల చదువు, కుటుంబ ఆరోగ్య ఖర్చు, విద్యుత్ కనెక్షన్లు, పాసుపుస్తకాల వంటి కనీస సేవల్లోనూ అవినీతి రైతుల్ని కుంగదీస్తున్నాయన్నారు.

రైతుల సంక్షోభంపై జయప్రకాష్ నారాయణ్ అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో పరిస్థితి తీవ్రంగా ఉన్నా ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని పలు రాష్ట్రాలలో ఇదే సంక్షోభం కొనసాగుతోందని, కేంద్ర ప్రభుత్వ స్థాయి రుణమాఫీని ఓట్ల కోసం హామీ ఇచ్చి రాష్ట్రస్థాయిలో అమలు చేస్తుండటంతో బ్యాంకుల నుంచి రుణాలు అందక అసంఖ్యాక చిన్న రైతులు ప్రైవేటు అధికవడ్డీల బారిన పడి తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉందని అన్నారు. ఎక్కువ పెట్టుబడి, అధిక వడ్డీతో ముందస్తుగానే కౌలు డబ్బు చెల్లించి పత్తి పంట వేసిన కౌలురైతులు జులై, ఆగస్టు మాసాల్లో వర్షాలు కురవక పంట పోవటంతో తట్టుకోలేకపోతున్నారని, ఇది రైతుల ఆత్మహత్యలు, తక్షణ సంక్షోభానికి కారణమైందని అన్నారు. అయితే గత ఏడాది పత్తి బాగా పండినా రేటు రాకపోవటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, క్వింటాలు రూ. 8,000 గరిష్ఠస్థాయికి చేరిన పత్తి ధర రూ. 3000 స్థాయిలోకి పడిపోకుండా ఉంటే ఈ ఏడాది నష్టాన్ని రైతులు చాలామేరకు తట్టుకోగలిగేవారని అన్నారు. ప్రకృతి అనుకూలించినా పెట్టుబడికి పరపతి విధానం అనుకూలంగా లేకపోవటంతో అధిక వడ్డీకి పెద్దఎత్తున అప్పులు తేవటం, పంట పండినా సరైన మార్కెట్ రేటు విధానం లేకపోవటం వల్లే రైతులు మునిగిపోతున్నారన్నారు. పంటకు రేటు, రైతుకు ఆదాయం కేంద్రంగా విధానాలు రూపొందించకుండా వ్యవసాయరంగ సంక్షోభం ఏదోకరూపంలో తలెత్తినప్పుడల్లా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు డ్రామాలాడటం పరిపాటైందన్నారు.

రైతులకు అన్ని రకాలుగా భరోసా కల్పించాల్సిన మార్కెట్ యార్డులు ఏమాత్రం మౌలిక సదుపాయాలు, గిడ్డంగులు లేకుండా కళావిహీనంగా, రాజకీయ పునరావాస కేంద్రాలుగా

ఉన్నాయని జేపీ అన్నారు. మార్కెట్ సెస్సు, గ్రామీణాభివృద్ధి సెస్సు, వ్యవసాయోత్పత్తుల మీద వ్యాట్ పేరుతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనిస్థాయిలో ఒక్క బియ్యం అమ్మకాల మీదే 12శాతం మేర పన్నులు విధిస్తూ ఏటా రూ. 2,000 కోట్లు దండుకుంటున్నా యన్నారు. రైతుల నుంచి తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా వసూలు చేసిన డబ్బు గత ఐదేళ్లలో వడ్డీతో కలుపుకుని సుమారు రూ. 20,000 కోట్లు ఉంటుందని, రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, పంటల్ని తగలేసుకుంటున్నా, పారపోసుకుంటున్నా, పంట విరామాల్ని ప్రకటిస్తున్నా, ఈ డబ్బుని మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగు పరచటానికిగానీ, ధరల్ని స్థిరీకరించటానికి గానీ, రైతులకు మంచి రేటు అందించటానికిగానీ ఆ డబ్బుని ఉపయోగించేందుకు పాలకులకు చేతులు రాలేదన్నారు. ప్రభుత్వాలు, కమీషన్ ఏజెంట్లు కలిపి బియ్యం రైతులకు రావాల్సిన ఆదాయంలో పందొమ్మిదన్నర శాతాన్ని లాక్కుంటున్నారన్నారు. రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, ప్రాణహిత-చేవెళ్ల వంటి ప్రాజెక్టుల పేరుతో ప్రతికూల ఫలితాలకు వెచ్చిస్తున్న డబ్బుతోనే రెండు రాష్ట్రాల్లో రైతులకు మెరుగైన ఆదాయాన్ని అందించవచ్చన్నారు.

టమాటా, ఉల్లి వంటి పంటల ధరలు ఇతర దేశాల్లో స్థిరంగా ఉంటుంటే, మనదేశంలో మాత్రం నేతల దుర్మార్గం వల్ల ధరల్లో విపరీత హెచ్చుతగ్గుల వచ్చి రైతులు బికారులవుతున్నారని జేపీ అన్నారు. టమాటా, ఉల్లి లాంటి పంటలకు ప్రాసెసింగ్ సౌకర్యాలు, పసుపు, పత్తిలాంటి పంటలకి స్టోరేజీతోపాటు ప్లెడ్జి లోన్లు (పంట తనఖా రుణాలు) ఇస్తే రైతుకి మంచి ధర వస్తుందని, లేదా ధర పెరిగేదాకా వస్తువుని నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుందని, వినియోగదారులకు మరింత ధర పెరగకుండా ఉంటుందని అన్నారు. ఇంతవరకూ ప్రభుత్వాలు ఇలాంటి ఏర్పాట్ల మీద శ్రద్ధ చూపిన దాఖలాలు లేవన్నారు. మార్కెట్ కమిటీలను అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారి అనుచరుల చేతుల్లో పెట్టటం, రైతుల్ని తాత్కాలిక ప్రలోభాలతో ఓటు బ్యాంకులుగా ఉపయోగించు కుంటున్నారన్నారు. రూ. 56,000 కోట్లతో ప్రపంచంలోనే అత్యధికంగా వంటనూనెల్ని, పప్పుదినుసుల్ని మనదేశం దిగుమతి చేసుకుంటోందని, వీటిని పండించేవారు మెట్టప్రాంతాలలోని పేదరైతులని తెలిసినా ప్రభుత్వాలు వారికి ప్రోత్సాహకాలను ఇచ్చే ప్రయత్నాలు పెద్దగా చేయటంలేదన్నారు. వాటి దిగుమతులపై 20శాతం సుంకం విధించి ఆ డబ్బును సబ్సిడీగా ఇచ్చి ఉంటే మూడేళ్లలో మన రైతులు వంటనూనెలు, పప్పుదినుసుల్లో స్వయంసమృద్ధిని సాధించి చూపేవారన్నారు. పాలకులు అనుసరించిన విధానాల వల్ల వ్యవసాయం మీద ఆధారపడిన వారు తగ్గకపోయినా, వారి ఆదాయం తగ్గుతోందని, వ్యవసాయం మీద ఆధారపడినవారు మెజారిటీగా ఉన్న గ్రామీణ ప్రాంతాలవారి ఆదాయం మిగిలినవారి ఆదాయంలో కేవలం ఆరోవంతు మాత్రమే ఉందన్నారు. వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ఆర్థిక వ్యవస్థగానీ, ప్రభుత్వంగానీ చూపలేకపోతోందన్నారు. ప్రపంచంలో కేవలం 2శాతం విస్తీర్ణం ఉన్నా 11శాతం వ్యవసాయ భూమి భారత్‌లో మాత్రమే ఉందని, అలాగే మనదేశంలోలాగా 50శాతానికి పైగా వ్యవసాయ భూమి ఉన్న దేశం మరెక్కడా లేదని, కేవలం పాలకులు అనుసరించిన విధానాల వల్ల వ్యవసాయ దిగ్గజంగా ఉండాల్సిన దేశం ఈవేళ జీవచ్ఛవాలుగా మారిన రైతులతో కళావిహీనంగా ఉందన్నారు.

**ప్రభుత్వాలు, కమీషన్ ఏజెంట్లు కలిపి బియ్యం రైతులకు రావాల్సిన ఆదాయంలో పందొమ్మిదన్నర శాతాన్ని లాక్కుంటున్నారన్నారు. రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, ప్రాణహిత-చేవెళ్ల వంటి ప్రాజెక్టుల పేరుతో ప్రతికూల ఫలితాలకు వెచ్చిస్తున్న డబ్బుతోనే రెండు రాష్ట్రాల్లో రైతులకు మెరుగైన ఆదాయాన్ని అందించవచ్చన్నారు.**

ఈ నేపథ్యంలో వ్యవసాయరంగాన్ని బాగు చేయటానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణం ఐదు చర్యల్ని చేపట్టాలని జేపీ డిమాండ్ చేశారు:

1) మార్కెట్ యార్డుల్లో యాజమాన్యాన్ని పూర్తిగా ఆ ప్రాంతంలో పంటలు పండించుకునే రైతుల చేతుల్లో పెట్టాలి. కనీసం రూ. 25,000 వ్యవసాయ సరకును మార్కెట్లో అమ్ముకునే రైతులకు ఓటు హక్కు ఇచ్చి వారు ఎన్నుకున్న కమిటీలకు యాజమాన్యం అప్పగించాలి. మార్కెట్ సెస్సు, గ్రామీణాభివృద్ధి సెస్సు, వ్యాట్ ఈ రూపంలో వసూలు చేసిన డబ్బుని మార్కెట్

కమిటీలపరిధిలోకి తెచ్చి వాటిని మౌలిక వసతులు, మార్కెట్‌లలో మంచి రేటు రావటానికి వినియోగించేలా చేయాలి.



2) మార్కెట్‌లో గిరాకీ తగ్గినప్పుడు ఆ పంటలకు ధర పెరిగేంతవరకు నిల్వచేసేందుకు స్టోరేజీకి ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకోవాలి. నిల్వచేసిన సరకు మీద విధిగా తక్కువ వడ్డీకి బ్యాంకుల నుంచి ప్లెడ్జి రుణాలు ఇప్పించాలి.

3) హెచ్చు వడ్డీల బారిన పడి రైతులు నలిగిపోకుండా తగిన ఏర్పాట్లతో అధిక వడ్డీల చట్టాన్ని సవరించాలి.

4) వంటనూనెలు, పప్పు దినుసులు దిగుమతిపై 20శాతం దిగుమతి సుంకం విధించి ఆ ఆదాయాన్ని పండించిన పంట చొప్పున రైతులకు ప్రోత్సాహకంగా ఇవ్వాలి

5) రిటైల్ చైన్లని, ఆగ్రో ప్రాసెసింగ్ పరిశ్రమల్ని పెద్దఎత్తున ప్రోత్సహించే విధంగా వాటిపై ఉన్న ఆంక్షల్ని, నిబంధనల్ని తొలగించాలి. రిటైల్ చైన్లు పెద్దఎత్తున ఏర్పాటైతే, గిడ్డంగులకి, రవాణా, గ్రేడింగ్, ప్రాసెసింగ్‌కి కావలసిన పెట్టుబడుల్ని అవే ప్రోత్సహిస్తాయి. దీనివల్ల ఉత్పత్తి చేసే చిన్న రైతులకి ఎక్కువ ధర లభించి, వినియోగదారులకి తక్కువ ధరలో వ్యవసాయ సరకులు అందుబాటులోకి వచ్చి ఇద్దరికీ లాభసాటిగా ఉంటుంది.


ఈ ఐదింటితోపాటు విద్యుత్ కనెక్షన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూమి రికార్డులు, ధృవపత్రాల జారీ, ప్రభుత్వ కార్యాలయాల్లో కనీస సేవల్లో అవినీతి లేకుండా రైతుల కోసం సిటిజన్ ఛార్టర్లను అమలు చేసేందుకు 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని అమలు చేయాలని జేపీ కోరారు. విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) వచ్చి ఐదేళ్లవుతున్నా ప్రభుత్వ విద్య నానాటికీ దిగజారుతోందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల సంఖ్య 10శాతం తగ్గి, ప్రైవేటు స్కూళ్లకి వెళ్లేవారి సంఖ్య 40శాతం పెరిగిందని, ఇలా ప్రైవేటు భారం మోస్తున్నవారిలో రైతుల పిల్లలే ఎక్కువగా ఉన్నారని అన్నారు. విద్య, ఆరోగ్యం వల్ల రైతుల మీద పెరుగుతున్న భారాన్ని తగ్గించేందుకు ఆ రెండు రంగాలను ప్రక్షాళన చేసి అందుబాటులో నాణ్యమైన విద్య, వైద్యం గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులోకి తేవాలన్నారు.

సరైన విధానాలు అమలు చేస్తే రైతులకు ఆదాయం పెరుగుతుందని లోక్‌సత్తా ఆచరణలో రుజువు చేసిందని, ఇతర దేశాల్లో బియ్యానికి డిమాండ్ ఉన్నా, మనదేశంలో 8కోట్లపైచిలుకు ఆహారధాన్యాలు గోదాముల్లో మూలుగుతున్నా గతంలో యూపీయే ప్రభుత్వం ఎగుమతుల్ని నిషేధించి రైతులకు ధర రాకుండా అణగదొక్కితే 2010-11లో లోక్‌సత్తా గట్టిగా పోరాడి ఎగుమతులకు అనుమతిని సాధించిందని, దాంతో ఈవేళ భారతదేశం బియ్యం ఎగుమతుల్లో ప్రపంచంలోనే నెంబర్‌వన్‌గా ఉందని జేపీ గుర్తుచేశారు. అలాగే 2012లో బియ్యం ఎగుమతులపై ఆంక్షలకు వ్యతిరేకంగా భుజాన బియ్యం మూటలతో కర్నూలు నుంచి కర్ణాటక వరకు, నిజామాబాద్ నుంచి మహారాష్ట్ర వరకు తాము చేసిన రైతు సత్యాగ్రహ యాత్ర వల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో రైతులకు ఒక్క బీపీటీ రకానికి ఒక్క సీజన్‌లో బస్తాకి రూ.300 చొప్పున ధర పెరిగిందని, రైతులకు రూ.3,600 కోట్ల లాభం సమకూరిందని వివరించారు. పాలకులు మొసలి కన్నీరు, పరస్పర ఆరోపణలు ఆపి రైతులలో తక్షణ భరోసా నింపటంతోపాటు ఈ ఐదు చర్యలనూ, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, అవినీతి లేని కనీస సేవలకు ఏర్పాట్లను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలో రైతులకు కీలకమైన మార్కెట్ కమిటీల్లో పరిస్థితులపై అధ్యయనం చేసి ప్రజల్లో అవగాహన పెంచి ప్రభుత్వం కళ్లు తెరిపించేలా ఆందోళనలు చేపట్టాలని లోక్‌సత్తా కార్యకర్తలకు, రైతు సంఘాలకు జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

లోక్‌సత్తా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హైమా పోతినేని, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, పార్టీ నేత కూసంపూడి శ్రీనివాస్ సమావేశంలో పాల్గొన్నారు. ■

# 30వేల ఎకరాలు సమీకరించాక ఇంకా భూ సేకరణ ఎందుకు?



## రైతులు, అన్ని జిల్లాల కోసం లోక్‌సత్తా, పవన్ కళ్యాణ్ కలిసి పోరాడాలి : జేపీ

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా 40,000 - 50,000 ఎకరాలతో భారీ నగర నిర్మాణం అసంబద్ధ ఆలోచన అని, ఇందులో ప్రజాప్రయోజనాలు లేవని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. రాజధానికి 4000 - 5000 ఎకరాలు చాలన్నారు. అంతా ఒకేచోట కేంద్రీకరించి హైదరాబాద్ విషయంలో చేసిన తప్పే మళ్లీ చేయకూడదన్నారు.

భూమి అవసరమైనంత వరకూ భూ సేకరణ చేయటం సరైన విధానమని, 30,000 పైచిలుకు ఎకరాలను సేకరించాక కూడా ఇంకా బలవంతంగా భూసేకరణ చేస్తామనటం తప్పుడు ధోరణని జేపీ అన్నారు. రాజధాని కోసం మధ్యలో ఎక్కడో చిన్నచిన్న ముక్కలుగా ఉండే భూమిని సేకరించాలనుకుంటే అర్థముంటుందని, ఊళ్లకు ఊళ్లను బలవంతంగా సేకరించటాన్ని మాత్రం ఖచ్చితంగా వ్యతిరేకించాల్సిందేనని అన్నారు.

చిన్న రైతులు, భూ యజమానులను కొల్లగొట్టి సంపన్న అనుచర బృందానికి కట్టబెట్టటం ప్రభుత్వం చేయాల్సిన పని కాదని, ప్రభుత్వం ఉన్నది అందరి సమగ్రాభివృద్ధి కోసమని గుర్తెరగాలని జేపీ అన్నారు. ఈ రియల్ ఎస్టేట్ పిచ్చిని ఎ.పి సర్కారు ఇక్కడితో ఆపాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమలకు పన్ను రాయితీల విషయంలో కూడా ఎ.పి ప్రభుత్వం సీఆర్‌డీఏ వరకు మాత్రమే అడుగుతోందని, మిగిలిన 1000 కిలోమీటర్ల తీరప్రాంతం, రాయలసీమ, ఉత్తర కోస్తా ఏమైపోవాలని జేపీ ప్రశ్నించారు. 1.3 కోట్ల జనాభాతో ఒక గ్రీన్ ఫీల్డ్ నగరం, మొత్తం పరిశ్రమలన్నీ ఒక్క నగరంలోనే కేంద్రీకరించటం అర్థరహిత, వక్రబుద్ధి ఆలోచన అని, అన్ని జిల్లాల అభివృద్ధీ మనకు కావాలన్నారు.

రైతుల ప్రయోజనాల్ని పరిరక్షించి కేవలం సీఆర్‌డీఏ ప్రాంతం ఒక్కటే కాకుండా మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందేలా లోక్‌సత్తా పార్టీ, పవన్ కళ్యాణ్ కలిసి పోరాటం చేయాలని జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ■

# సహకార వ్యవస్థను ఇరు రాష్ట్రాలూ బలోపేతం చేయాలి

- డాక్టర్ పి. భాస్కరరావు,
(కన్వీనర్, స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య)

ప్రజలు అభివృద్ధి చెందటానికి, భద్రతతో సామరస్యంగా జీవించటానికి పరస్పర సహకార సంఘాలుగా ఏర్పడటం నాగరికతలో ఒక కీలక పరిణామం. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను ప్రజల జీవితంలో భాగంగా, రోజువారీ సంస్కృతిగా మార్చేవి సహకార సంఘాలు. ఇలా ప్రజలు సంఘాలుగా ఏర్పడి ఆధునిక ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేసే క్రమానికి మనదేశంలో 150-200 ఏళ్ల చరిత్ర ఉంది. అయితే, ఎన్నో అవరోధాలను ఎదుర్కొని ఈ వ్యవస్థ ఎదుగుతున్నా అప్రజాస్వామిక పాలకుల తీరు వల్ల ఇంకా జనజీవితంలో భాగం కాలేదు. సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి జాతీయస్థాయిలో గ్యారంటీనిస్తూ స్వతంత్ర భారత చరిత్రలో గొప్ప పరిణామంగా నిలిచిపోయే 97వ రాజ్యాంగ సవరణ వచ్చాక సంఘాల స్వతంత్ర కార్యకలాపాలకు స్పష్టమైన భరోసా లభించినప్పటికీ, రాష్ట్రాల పరిధిలోని అంశాలను అడ్డం పెట్టుకుని సహకార సంఘాల స్వయంప్రతిపత్తిని నీరుగార్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రైతులు లాభాల్ని ఆర్జించుకునేందుకు పాడి పరిశ్రమ రంగంలోనే విప్లవాత్మకమైన రీతిలో 1995లో తీసుకొచ్చిన 'మ్యాక్స్' చట్టాన్ని (పరస్పర సహాయ సహకార చట్టం) నీరుగార్చేందుకు ప్రయత్నించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల రీతిలోనే ఇటీవలి కాలంలో సాక్షాత్తూ తెలంగాణ వ్యవసాయ శాఖామంత్రి కూడా మాట్లాడారు. హైదరాబాద్‌లో విజయ డెయిరీ, అమూల్ మధ్య స్వేచ్ఛా మార్కెట్ పోటీని కాస్తా మ్యాక్స్ చట్టం వైఫల్యమన్నట్టు చిత్రీకరించారు. విజయ డెయిరీని నిర్వీర్యం చేయటానికే గతంలో మ్యాక్స్ చట్టాన్ని తీసుకొచ్చారని మంత్రి ఆరోపించారు. ఒకరో ఇద్దరో వ్యక్తులు పెట్టుకునే కంపెనీలకు రాత్రికి రాత్రి భూముల్ని, రాయితీల్ని సమకూరుస్తున్న ప్రభుత్వం పదిమందీ కలిసి పరస్పర సహకారంతో సంస్థను నడుపుకునే వ్యవస్థను తప్పుపట్టకూడదని, తమకు అధికారాన్నిచ్చిన రాజ్యాంగమే పౌరులకి సహకార సంఘాల హక్కును కల్పించిందని సదరు మంత్రిగారికి గుర్తురాలేదు. సహకార సంఘాల సభ్యులు తమ సంఘాల్ని పటిష్టంచేసుకునేలా నిర్వహణల్ని క్రమబద్ధీకరించుకోకుండా పెత్తందారీ ధోరణితో వ్యవహరిస్తుండటం కూడా ప్రభుత్వాల అప్రజాస్వామిక వాదనలకి ఊతమిస్తున్నట్టవుతోంది.

ఈ నేపథ్యంలో, రైతులు ఆదాయాల్ని పెంచుకునేందుకు వీలుగా సహకార పాడిపరిశ్రమను ప్రోత్సహించే నూతన డెయిరీ



విధానాన్ని త్వరలో తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నట్టు వస్తున్న వార్తలు ఆశను రేకెత్తిస్తున్నాయి. వ్యవసాయ మంత్రి వ్యాఖ్యల్ని ఆయన వ్యక్తిగతానికే పరిమితం చేస్తూ సహకార వ్యవస్థను బలోపేతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించటం హర్షణీయం. నిజానికి రాష్ట్ర విభజనను ఒక అవకాశంగా మలచుకోవాలంటే ఈపాటికే రెండు రాష్ట్రాలూ ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా ప్రజలకు హక్కుగా సేవలందించే 'సర్వీస్ గ్యారంటీ' చట్టం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, పటిష్ట సహకార సంఘాల వ్యవస్థ నిర్మాణం మీద దృష్టిపెట్టి ఉండాల్సింది. కనీసం ఈ మేరకు సంస్థాగత మార్పుల్ని అమలు చేసినా, పెరుగుతున్న పట్టణ ప్రజానీకంతోపాటు రెండు రాష్ట్రాల్లో మెజారిటీగా ఉన్న వ్యవసాయాధారిత కుటుంబాల జీవితాలలో కొంత మెరుగుదల కనిపించేది. ఓటుకు కోట్లు, పార్టీల ఫిరాయింపులు, అనుచిత ఉచితాలు, విద్వేష రాజకీయాలు ఆయా నేతలకు, పార్టీలకు సంబంధించినవి. తప్పు చేసిన వారికి తగురీతిలో బుద్ధి చెబుతూనే, తమ జీవితాల్ని బాగుచేసే ఎజెండా మీదే దృష్టి పెట్టి వాటిని ఎలా సాధించుకోవాలో జనం ఆలోచించాలి.

రెండు తెలుగు రాష్ట్రాలలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన పటిష్ట సహకార వ్యవస్థను నిర్మించుకునేందుకుగాను, పాడిరైతులకు మేలు చేసే మ్యాక్స్ చట్టం, సహకార సంఘాల స్వయంప్రతిపత్తి, ఆవశ్యకత, ఉన్న చట్టాలలో లోటుపాట్లను సరిచేయటంపై ప్రజలు కాస్త లోతుగా విషయాలను పరిశీలించటం అవసరం.

మనదేశంలో పౌరులు కలిసి సంస్థలు ఏర్పరుచుకోవటానికివీలుగా 1860లో తెల్లవారి పాలనలో ఈ సొసైటీల చట్టం ఏర్పడింది. ఆరోజు రాజ్యాంగం లేకపోయినా మనకు కొంత స్వేచ్ఛని కల్పించేలా బ్రిటీషువారు ఈ చట్టాన్ని ఏర్పాటుచేశారు. ఆ చట్టంకిందే 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటైంది. తర్వాత స్వాతంత్ర్యోద్యమం చురుకుగా జరుగుతున్నకాలంలో కూడా రాజకీయ అవగాహన పెంచటానికి సొసైటీలను నమోదుచేసుకునే హక్కును కూడా వలసపాలకులు కల్పించారు. బేషరతుగానే పౌరులకు హక్కుల్ని ఇచ్చారు. ఆ తర్వాత హైదరాబాద్ సంస్థానంలో నిజాంపాలనలో 1940లో కూడా అదే చట్టాన్ని స్వల్ప సాంకేతికమార్పులతో (1350వ ఫసలీ) యధాతథంగా అమలుచేశారు. 1950లో అమలులోకొచ్చిన భారతరాజ్యాంగం ఇలాంటి సంస్థలు ఏర్పాటుచేసుకునే స్వేచ్ఛను ప్రాథమికహక్కుగా గుర్తించి 19(1) అధికరణంలో హామీనిచ్చింది. ఇలాంటి చట్టాల వల్లనే దేశమంతా లక్షలాది సంస్థలు రూపుదిద్దుకున్నాయి. వీటి కృషి వల్ల కోట్లమంది స్వేచ్ఛ విస్తరించే అవకాశం లభించింది. తమకి రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛతో, ప్రభుత్వ ప్రమేయంలేకుండా ఉమ్మడి లక్ష్యాల కోసం సంఘటితమయ్యేందుకు ప్రజలకు కొంత వెసులుబాటు దొరికింది.

స్వతంత్ర భారతదేశంలో, తెలుగు రాష్ట్రాలలో వర్గీస్ కురియన్, ఎం. రామరెడ్డి, శశిరాజగోపాలన్ వంటి వారు, లోక్‌సత్తా సంస్థ చేసిన కృషి వల్ల సహకార సంఘాల స్వయంప్రతిపత్తి వేళ్లూనుకుని ముఖ్యంగా కోట్లాది రైతులకు మేలు జరుగుతోంది. 1964 నాటి సహకార చట్టం వల్ల సంఘాలు పూర్తిగా ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి నిర్వీర్యమై దివాళా దిశగా సాగుతున్న నేపథ్యంలో సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి హామీనిచ్చే ప్రామాణికమైన 'మ్యాక్స్' చట్టం (పరస్పర సహాయ సహకార చట్టం)ను 1995లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చింది. గుజరాత్ 'ఆనంద్ డెయిరీ' నమూనాలో దేశవ్యాప్తంగా పాడి పరిశ్రమాభివృద్ధి కోసం మొదలైన పాడివెల్లువ పథకంలో ప్రభుత్వ జోక్యం, ప్రమేయం, పెత్తనం వల్ల పాల సహకార వ్యవస్థలో రాజకీయాలు పెరిగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసిన నేతలు సహకార వ్యవస్థల పాలకవర్గాలలో చేరారు. అన్ని స్థాయిలలో అధికారుల పెత్తనానికి ఆస్కారం ఏర్పరిచారు. సహకార సంస్థలు తమ అవసరాల మేరకు ఏర్పాటు చేసుకోవాల్సిన యంత్రపరికరాలు వంటి వాటిని అధికారులు, నామినేటెడ్ పాలకవర్గాలు సంస్థల నెత్తిన రుద్దాయి. సంస్థలకు స్వయంప్రతిపత్తి, స్వావలంబన, స్వయంనిర్ణయాధికారం లేకుండా పోయాయి. ఫలితంగా పాల సహకార వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. దీంతో పునరాలోచన మొదలైంది. సహకార సంఘాలను ప్రభుత్వ నియంత్రణకు తావు లేకుండా స్వతంత్రంగా, ప్రజాస్వామ్యబద్ధంగా, వృత్తిగతంగా నిర్వహించాలని బ్రహ్మప్రకాశ్ కమిటీ (1990), నమూనా సహకార చట్టం (1991), వైద్యనాథన్ కమిటీ (2005) సహా పలువురు నిపుణుల నివేదికలు నొక్కి చెప్పాయి. ఈ నేపథ్యంలో, తెలుగునాట మరణావస్థలో ఉన్న పాల సహకార సంఘాలకు మ్యాక్స్ చట్టం ప్రాణం పోసింది.

దేశంలోనే అసాధారణమైన ఈ మ్యాక్స్ చట్టాన్ని అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి రామారావు తీసుకొచ్చారు. సహకార సంఘాల స్వయంప్రతిపత్తి కోసం కృషి చేసిన రామరెడ్డి,

శశిరాజగోపాలన్, ఇటీవల పదవీవిరమణ చేసిన ప్రధాన ఎన్నికల కమిషనర్ సంపత్, డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆ చట్టం రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. అయితే 1964 చట్టాన్ని కదిలిస్తే, ప్రభుత్వ సాయం అందుతోంది వంటి వంకలతో అడ్డుపుల్లలు వేస్తారనే ముందుచూపుతో ప్రభుత్వ సాయం ఏమాత్రం లేని స్వయంప్రతిపత్తిగల సహకార సంఘాలకు మాత్రం వర్తించేలా వారు మ్యాక్స్ చట్టాన్ని తయారుచేశారు. వీటిల్లో ప్రభుత్వ పెట్టుబడి కాని, సబ్సిడీలు కాని ఉండవు. స్వర్గీయ ఎన్.టి.ఆర్ సహకార సంఘాల స్వయంప్రతిపత్తి కోసం అపారమయిన సంకల్పాన్ని, నాయకత్వాన్ని ఇచ్చారు. జెడ్పీ ఛైర్మన్‌గా పనిచేసిన అనుభవముంది కాబట్టి, అసాధారణమే అయినా దేవేందర్ గౌడ్‌కి ప్రొహిబిషన్ శాఖతోపాటు సహకార శాఖ మంత్రిత్వ బాధ్యతల్ని ఆనాటి ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ అప్పగించారు. రైతులకు ప్రభుత్వ పాడి సమాఖ్య చెల్లిస్తున్న సేకరణ ధర కంటే మ్యాక్స్ సంఘాలు చెల్లిస్తున్న ధర ఎప్పుడూ ఎక్కువగానే ఉంటూ వచ్చింది.

**స్వర్గీయ ఎన్.టి.ఆర్ సహకార సంఘాల స్వయంప్రతిపత్తి కోసం అపారమయిన సంకల్పాన్ని, నాయకత్వాన్ని ఇచ్చారు. జెడ్పీ ఛైర్మన్‌గా పనిచేసిన అనుభవముంది కాబట్టి, అసాధారణమే అయినా దేవేందర్ గౌడ్‌కి ప్రొహిబిషన్ శాఖతోపాటు సహకార శాఖ మంత్రిత్వ బాధ్యతల్ని ఆనాటి ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్ అప్పగించారు.**

ఈ రకంగా మ్యాక్స్ కింద ఏర్పడిన పాల సహకార సంస్థలు విజయవంతంగా నడుస్తున్న తరుణంలో, కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, ఆ పార్టీ అధికారంలో ఉన్న సుమారు 8 రాష్ట్రాలలో కూడా మ్యాక్స్ తరహా చట్టాన్ని తీసుకొచ్చినా, అలాంటి చట్టాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ నేతృత్వంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన యూపీయే ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో పెట్టుకున్నా, రాష్ట్రంలో 2004లో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మ్యాక్స్ చట్టాన్ని రాత్రికి రాత్రి నిర్వీర్యం చేసి సహకార సంఘాల్ని ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నాలు జరిగాయి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సొంత జిల్లా కడపలో, మాజీ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో, సహకార మంత్రి సొంత జిల్లా గోదావరిలో ప్రభుత్వ డెయిరీలు మూతపడటాన్ని, మ్యాక్స్ చట్టం కింద ఉన్న పాల సహకార సంఘాలు లాభాల బాటలో ప్రయాణిస్తూ రైతులకు ఆదాయాన్నిస్తున్న తీరును వివరిస్తూ సహకార సంఘాల స్వయంప్రత్తి కోసం కృషి చేసిన పెద్దలు, లోక్‌సత్తా ఈ ప్రయత్నాల్ని గట్టిగా అడ్డుకున్నారు. అసెంబ్లీలో, హైకోర్టు, సుప్రీంకోర్టులలో పోరాడి ఆపారు.

ఈ చట్టంలో ప్రభుత్వం జోక్యం జరిగితే, రిజిస్ట్రార్ ఎప్పుడు తల్చుకుంటే అప్పుడు సొసైటీని రద్దుచేసి అక్కడ ఇంఛార్జి అధికారిని నియమించవచ్చు. ఈ తరహాలో ప్రభుత్వం వెళ్తే... బార్ అసోసియేషన్లు, విద్యార్థి సంఘాలు, మహిళామండళ్లు, యువజన సంఘాలు, విద్యాసంస్థలు, మెడికల్ అసోసియేషన్లు, వేలాది స్వచ్ఛంద సంస్థలు తదితర అన్నిరకాల అసోసియేషన్లు, గ్రామాభివృద్ధి సంఘాలు, క్రీడాసంఘాలు, మూవీ ఆర్టిస్టుల సంఘం, వృత్తిపరమైన సంఘాలు, పాత విద్యార్థుల సంఘం వంటివాటిని కూడా రద్దుచేయవచ్చు. ఆంధ్ర లయోలా, సిద్ధార్థ వంటి విద్యాసంస్థల్ని, వైద్యసంస్థల్ని, చివరకు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కళాశాలను కూడా స్వాధీనం చేసుకోవచ్చు. అంటే, పౌరులు స్వచ్ఛందంగా కలిసి ఏర్పాటుచేసుకునే ప్రతిసంస్థలోనూ ప్రభుత్వం జోక్యం చేసుకుని పెత్తనం చేయవచ్చు! ఇదే సూత్రాన్ని ట్రేడ్ యూనియన్లకి, దానం చేసే ట్రస్టుకి కూడా వర్తింపచేస్తే (అవి కూడా రాజ్యాంగంలో 19(1)(సి), 19(4) అధికరణాల వల్ల ఏర్పడేవే) బ్లడ్ బ్యాంకులు, నేత్రసంస్థలు, అన్నిరకాల ట్రేడ్‌యూనియన్లు- వీటన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు! ఇంతకంటే హాస్యాస్పదమైన చట్టం, ఇంతకంటే మన స్వేచ్ఛని హరించే చట్టం మరొకటుంటుందా?

జాతీయ సలహా మండలిలో పనిచేసే అవకాశాన్ని వినియోగించుకుని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ జాతీయస్థాయిలో సహకార సంస్థల స్వయంప్రతిపత్తి కోసం చేసిన 97వ రాజ్యాంగ సవరణను ప్రతిపాదనకు యూపీయే ప్రభుత్వం, అన్ని పార్టీలూ అండగా నిలిచాయి. దీంతో, పౌరులు సంఘాలుగా, ట్రేడ్‌యూనియన్లుగా ఏర్పడే అవకాశాన్ని కల్పిస్తూ రాజ్యాంగం 19 (1-సి) అధికరణంలో కల్పించిన హక్కును విస్తరిస్తూ సహకార సంఘవ్యవస్థగా కూడా ఏర్పడే అవకాశాన్ని చేరుస్తూ 97వ రాజ్యాంగ సవరణ 2012లో సాకారమైంది. యూపీయే సాంప్రదాయ రాజకీయ ధోరణి వల్ల 73, 74వ రాజ్యాంగ సవరణలల్లోలాగా 97వ రాజ్యాంగ సవరణలో కూడా కొంత గందరగోళం, అనవసరంగా పార్ట్ 9 బి చేర్చటం వేరే చర్చనీయాంశం. మొత్తానికి, ప్రభుత్వ అనవసర

జోక్యం, పెత్తనం లేకుండా తమ సొంతంగా సహకార సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు మాత్రం ఆ సవరణ ద్వారా ప్రజలకు సమకూరింది. రాజ్యాంగం కల్పించిన ఓ కీలకహక్కు ప్రజలకు అందివచ్చింది. ఒకసారి అలాంటి సహకార సంఘం ఏర్పడ్డాక, 1) దేశసమగ్రతకు భంగం వాటిల్లుతున్నప్పుడు 2) చట్టవిరుద్ధ కార్యకలాపాలులేదా శాంతిభద్రతల ఉల్లంఘన 3) అశ్లీలత వంటివి ఉన్నప్పుడు (మొరాలిటీ) మూడు సందర్భాలలో మాత్రమే ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశముంది.

ఇప్పుడు మనం పాడి రైతులకు మేలు చేసే 1995నాటి మ్యాక్స్ చట్టాన్ని కాపాడుకోవటంతోపాటు దాన్ని పరిపుష్ఠం చేసేందుకు కూడా కొన్ని చర్యలు తీసుకోవాలి. 1964 చట్టాన్నయితే పూర్తిగా మార్చాలి. కానీ రాష్ట్రంలోని మ్యాక్స్ చట్టంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి, రిజర్వేషన్లకు సంబంధించి రెండు సవరణల్ని చేరిస్తే చాలు.

**మొత్తానికి, ప్రభుత్వ అనవసర జోక్యం, పెత్తనం లేకుండా తమ సొంతంగా సహకార సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు మాత్రం ఆ సవరణ ద్వారా ప్రజలకు సమకూరింది. రాజ్యాంగం కల్పించిన ఓ కీలకహక్కు ప్రజలకు అందివచ్చింది.**

లోక్‌సత్తా కృషి వల్ల 97వ రాజ్యాంగ సవరణ వచ్చిందిగానీ, సహకార సంఘాలకు ఎన్నికలను ఒకేసారి జరిపి, రాజకీయ వేడి వాతావరణాన్ని సృష్టించకుండా రాజ్యసభ తరహాలో 1/3 వంతు మందిని ఎన్నుకునేలా చేయాలని ఆ సమయంలో జయప్రకాష్ నారాయణ్ చేసిన సూచన రాజ్యాంగ సవరణ పేరాను కలిపిన సంప్రదాయ ఆలోచనాపరులు అర్థం చేసుకోకుండా, మూర్ఖంగా కేవలం ఎన్నికలను విధిగా 5ఏళ్లకోసారి నిర్వహించాలన్న పదం కలిపారు. అయితే, ఎన్నికలను విధిగా నిర్వహించే ఏర్పాటు వచ్చింది కాబట్టి, ఎవరు నిర్వహించాలో స్పష్టత తెచ్చుకుంటే, మనం ఆశించిన కొన్ని ఫలితాలనైనా సాధించవచ్చు. ఎన్నికల నిర్వహణకు మళ్లీ ఇంకో వ్యవస్థను ఏర్పాటు చేసి ఫోన్లు, ఫ్యాన్లు పేరుతో ప్రభుత్వ ఖజానా మీద భారం మోపే కంటే, రాష్ట్ర ఎన్నికల సంస్థ ఒకటుంది కాబట్టి, ఆ రాజ్యాంగ సంస్థకు స్థానిక ఎన్నికలు నిర్వహించటం మినహా వేరే ఏమీ కార్యక్రమాలు లేవుకాబట్టి ఆ సంస్థను సహకార ఎన్నికలకు వినియోగించుకోవచ్చు. ఈ దిశగా సవరణను మ్యాక్స్ చట్టంలో చేర్చాలి.

రెండోది, సామాజిక పరిస్థితుల దృష్ట్యా ప్రజాస్వామీకరణలో భాగంగా మహిళలు, దళితులకు సంఘాల్లో తగు ప్రాధాన్యతను రాజ్యాంగ సవరణలో పేర్కొన్న రీతిలో కల్పించాలి. దీని మీద అభ్యంతరాలు చెప్పాల్సిన అవసరమేమీ లేదు.

ఇక ఇతర సహకార సంఘాల విషయానికొస్తే, సభ్యత్వ నమోదు గురించి రాజ్యాంగ సవరణలో లేదు. ఎవరిని పడితే వారిని సభ్యులుగా చేర్చుకుంటే, బోగస్ సభ్యత్వాలు ఎక్కువై రాజకీయ, పెత్తందారీ శక్తులు వాటిని కబ్జా చేసే అవకాశముంది. కాబట్టి కులం, మతం వంటి విభజనలేవీ చేయనంతకాలం, డిపాజిట్ పెట్టటం (ఉదాహరణకు రూ.5,000), ఏదోక క్షేత్రస్థాయి కార్యక్రమంలో కనీసం ఏడాదిపాటు పాలుపంచుకున్నవారికే సంబంధిత సహకార సంస్థలో సభ్యులుగా చేరే అవకాశం కల్పించటం వంటి నిబంధనల్ని చేర్చాలి. పాలు, చెరకు ఇలా ఏదోకరంగంలో తగిన సేవలు అందించినవారికే వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులయ్యే అవకాశం ఉండాలి. అలాగే సభ్యత్వ నమోదు జరిగాక ఓటుహక్కు ఇవ్వటానికి కనీసం ఏడాది పరిమితి ఉండేలా చూడాలి.

సహకార బ్యాంకింగ్ రంగ ఆడిటింగ్‌కు సంబంధించి, సూచించిన ప్యానల్ చార్టర్డ్ అకౌంటెంట్లతో నిర్వహించుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవచ్చు.

అర్బన్ బ్యాంకుల విషయానికొస్తే, మొత్తం వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యతను రిజర్వుబ్యాంకు పరిధిలోకి తీసుకెళ్లటం మేలు. ఎందుకంటే, సభ్యత్వ నమోదు, పాలన, ఎన్నికల నిర్వహణ ఇలాంటివన్నీ వేర్వేరు పర్యవేక్షణల కింద ఉన్నప్పుడు సమన్వయానికి ఒక సమర్థ వ్యవస్థ అవసరం.

వ్యవసాయ ఉత్పాదకతను, స్వేచ్ఛా మార్కెట్‌తో రైతులకు ఆదాయాన్ని పెంచుతూనే మరోపక్క, వ్యవసాయం మీద ఆధారపడినవారి సంఖ్యను క్రమంగానైనా తగ్గించటం ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందున్న పెనుసవాలు. రైతులతోపాటు అన్నివర్గాల ప్రజలకు సాధికారతను సాధించాలంటే, సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి 97వ రాజ్యాంగ సవరణ ఇచ్చిన భరోసాను ఉపయోగించుకుని మ్యాక్స్ చట్టాన్ని, సహకార వ్యవస్థను బలోపేతం చేయటం కీలకం. ■

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...)

# కేసీఆర్! ఆటస్థలాలను కాపాడతారా? అనారోగ్య హైదరాబాద్‌ను తయారుచేస్తారా?


## జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద లోక్‌సత్తా కబడి..కబడి

గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటస్థలాలను పరిరక్షించాలని, కబ్జాలో ఉన్న వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద కబడ్డీ ఆడి వినూత్న ఆందోళన నిర్వహించింది.

ఆగస్టు 15న పిల్లలు ఆడుకునేందుకు, పోటీలు నిర్వహించుకునేందుకు నగరంలో చాలాచోట్ల స్థలాలే లేవని, స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఎన్టీఆర్ స్టేడియంను ఆటలకే కేటాయిస్తామని, కళాభారతిని వేరే చోట నిర్మిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రకటించి ఒక మంచి సంకేతాన్నివ్వాలని పార్టీ జీహెచ్ఎంసీ కమిటీ డిమాండ్ చేసింది.

లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దోసపాటి రాము, బంతు సాంబిరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వతంత్రం వచ్చి దశాబ్దాలవుతున్నా హైదరాబాద్ నగరంలో పేద, మధ్యతరగతి పిల్లలకు ఆటస్థలాలు లేవని, 1 కోటి జనాభా ఉన్న నగరంలో కనీసం 5,000 ఆటస్థలాలుండాల్సి ఉండగా, కేవలం 660 మాత్రమే ఉన్నాయని, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో ఐదు మాత్రమే నమోదుచేశారని అన్నారు. ప్రతి కాలనీలో పార్కు, ఆటస్థలం, కమ్యూనిటీ హాలు ఉండాలన్న నిబంధనతో లే అవుట్ అనుమతులిచ్చినా చాలాచోట్ల ఆటస్థలాలు కబ్జాకు గురయ్యాయన్నారు. ఆకాశహర్మ్యాలతో హైదరాబాద్‌ని సింగపూర్‌లాగా అభివృద్ధి చేస్తామంటున్న కేసీఆర్ నగరానికి ఊపిరితిత్తుల్లాంటి ఆటస్థలాలు లేకుండా చేస్తున్నారని, కబ్జాలను కూడా ఆమోదిస్తున్నారని, విద్యార్థులు, యువతకు అనారోగ్యకర నగరాన్ని తయారుచేస్తున్నారని అన్నారు. పతకాలు సంపాదించాలని క్రీడాకారులకు కోట్ల రూపాయల నజరానా ఇచ్చి ప్రోత్సహిస్తున్న కేసీఆర్ ప్రభుత్వం ఆటస్థలాలను మాత్రం అందుబాటులోకి లేకుండా చేస్తోందన్నారు.


మునిసిపల్ శాఖను కూడా తన అధీనంలోనే పెట్టుకున్న కేసీఆర్ వెంటనే నగరంలో కబ్జాకు గురైన ఆటస్థలాల్ని స్వాధీనం చేసుకునేందుకు పెద్దఎత్తున డ్రైవ్ నిర్వహించాలని, ప్రత్యేక భూ రక్షణ దళాల్ని ఏర్పాటు చేయాలని రాము, సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. మేడ్చల్, మహేశ్వరం, కూకట్‌పల్లిలోని ఇండోర్ స్టేడియంలను వెంటనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, ఎన్టీఆర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, క్రికెట్, టెన్నిస్,




కబడ్డీ, బాస్కెట్‌బాల్ తదితర క్రీడలకు కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. మన రాష్ట్రం, మన అవినీతి అనే రీతిలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చాక కూడా కబ్జాలు, వాటిని ప్రోత్సహిస్తున్న అవినీతి గతంలోలాగే కొనసాగుతున్నాయని, అవినీతిపై పోరును కేసీఆర్ మాటల్లో కాకుండా చేతల్లో చూపాలన్నారు. కబ్జాకు గురైన ఆటస్థలాలను స్వాధీనం చేసుకోవటం ప్రభుత్వం వల్ల కాకపోతే లోక్‌సత్తాకు అప్పచెబితే ఏడాదిలోగా హైదరాబాద్‌లో ప్రతి కాలనీలోని వారి ఆటస్థలాన్ని అందుబాటులోకి తెచ్చి చూపిస్తుందని, బస్తీల్లో ఆటస్థలాల ఏర్పాటుకి పరిష్కారం చూపుతుందని అన్నారు. ప్రభుత్వం దీనిపై స్పందించకపోతే కాలనీ సంఘాలతో కలిసి పోరాటం చేస్తామని రాము, సాంబిరెడ్డి స్పష్టంచేశారు.

లోక్‌సత్తా పార్టీ నేతలు గంగాభవాని, లావణ్య, జగన్ మెట్ల, సురేంద్ర, నాగమణి, నాగేంద్రబాబు, భవాని, వంశీ ప్రసాద్, సతీష్, శ్రీనివాసరెడ్డి, కిషోర్, శ్రావణ్, రాజీవ్, వినోద్, నాగరాజు, రంజిత్, సుబ్రమణ్యం, శ్రీనివాస్, నరసింహారావు, రామన్న తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. ■

# కలాం కలలకు, రాజకీయానికి మధ్య అగాధాన్ని అధిగమించటమే అసలైన నివాళి: జేపీ



పేద, ధనిక, చిన్న, పెద్ద, ఉత్తరం, దక్షిణం తేడాలేకుండా దేశవ్యాప్తంగా ఆబాలగోపాలం డా॥ ఏపీజే అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తుండటానికి ఆయన చేపట్టిన రాష్ట్రపతి, శాస్త్రవేత్త వంటి పదవులు కారణం కాదని, కులం, మతం, ప్రాంతం, భాష, డబ్బు, పార్టీ రాజకీయాలకు అతీతంగా ప్రతి బిడ్డా ఎదిగే భారతదేశ నిర్మాణానికి నిరంతరం తపించారు కాబట్టే కలాంను అందరం నిండు మనసుతో స్మరించుకుంటున్నామని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. తన ఆశావాదం, పరిష్కార ధోరణి, అంతరాలను అధిగమించగల సామర్థ్యం, నిజమైన సెక్యులర్ జాతీయతా భావాలు, నిరాడంబరతతో, అధికారంలో ఉన్నవారికంటే ఎక్కువగా కలాం ప్రజలను ప్రభావితం చేశారన్నారు. ఓ పక్క కలాంకు లభిస్తున్న నివాళి భారతీయుల గుండెలోతుల్లోని ఆకాంక్షల్ని చాటుతుంటే, మరోపక్క వాటిని నెరవేర్చాల్సిన రాజకీయ వ్యవస్థ పార్లమెంటులో చిన్నవిషయానికి, పెద్దవిషయానికి రణరంగం సృష్టించటమే ధ్యేయంగా వ్యవహరిస్తోందని, ఈ రెంటి మధ్యా అగాధాన్ని పూడ్చటమే కలాంకు మనమివ్వగలిగే అసలైన నివాళి అన్నారు.

మెజారిటీ, మైనారిటీ గొడవలున్న ఈ దేశంలో ఒక పేద ముస్లిం కుటుంబంలో పుట్టి జాతిని ప్రభావితం చేసే అత్యున్నత స్థాయికి ఎదగటం, తన జీవితాన్నే ఒక సందేశంగా అందించటం ద్వారా కలాం ప్రతి గుండెనూ స్పందింపచేశారని జేపీ అన్నారు. మహాత్మాగాంధీ మార్గంలో కలాం అనుకున్నదే చెప్పారని, చెప్పిందే ఆచరించి చూపారని అన్నారు. స్వతంత్రానంతరం జాతి నిర్మాణం కోసం ఈస్థాయిలో కృషి చేసినవారు బహు అరుదన్నారు. ఒక తరం యువ భారతీయుల ఆలోచనల్ని ఆయన వెలిగించా రని అదికార్యాచరణగా కొన సాగాలని అన్నారు.

ఈఎంఆర్ఐ, ఎల్.వి ప్రసాద్ కంటి వైద్యసంస్థ బోర్డుల్లో, రాజకీయాలలో నేరచరితుల ప్రవేశాన్ని అడ్డుకునే బిల్లుకు మద్దతును కూడగట్టటంలో కలాంతో తాను కలిసిపనిచేశానని జేపీ గుర్తుచేసుకున్నారు.

కలాం ఏరోజూ నిరాశానిస్పృహలకులోనై రాజీపడి తప్పుడు రాజకీయాలను ప్రోత్సహించిన దాఖలాలు లేవని జేపీ అన్నారు. భవిష్యత్తు భారతదేశం అంతరాలు లేని గొప్పసమాజంగా రూపొందుతుందని నిరంతర ఆశావాదంతో, చెరగని చిరునవ్వుతో బలంగా నమ్మేవారన్నారు. రాష్ట్రపతి పదవిని భుజకీర్తిగా ఎన్నడూ భావించలేదని, నిరాడంబరంగా, కర్మయోగిలా జీవించారన్నారు. కొత్త విషయాలను చిన్న పిల్లల నుంచి కూడా వారి స్థాయిలో వ్యవహరిస్తూ నేర్చుకునే జిజ్ఞాసను ప్రదర్శించేవారన్నారు.

వ్యక్తులు, పార్టీల కన్నా దేశప్రయోజనాలే మిన్న అని ఆచరణలో చూపిన కలాం ఆకస్మిక మృతి దేశానికి తీరని లోటే అయినా, ఆయన దాదాపు సంపూర్ణ జీవితం గడిపిన విశ్వ భారతీయుడని, ఆ స్ఫూర్తిని కార్యాచరణగా మార్చుకుని వివక్ష లేకుండా ప్రతి బిడ్డా ఎదిగే వ్యవస్థల్ని నిర్మించుకుందామని జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ■

## డా॥ వి.వి రామారావు మృతి సమాజానికి, లోక్‌సత్తాకు లోటు : జేపీ



లోక్‌సత్తా పార్టీ రాజమండ్రి నగర అధ్యక్షుడు, ప్రముఖ వైద్యుడు, హేతువాద కార్యకర్త డా॥ వి.వి రామారావు (77) అకాల మృతి పట్ల పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

సుమారు రెండు వారాల క్రితం రాజమండ్రి-కాకినాడ మధ్య రంగంపేట వద్ద జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రామారావు ఆగస్టు 26 రాత్రి మృతి చెందారు. రాజమండ్రి కిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన్ని 24న జేపీ పరామర్శించారు. రామారావు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్‌గా, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేశారు. రిటైరయ్యాక రాజమండ్రి జీఎస్ఎల్, ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలకు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. జనరల్ మెడిసిన్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన రామారావు దేశవిదేశాలలో పలు సదస్సులలో పాల్గొని తన అనుభవాల్ని అందించారు. హేతువాద ఉద్యమంలో కూడా చురుగ్గా పాల్గొనేవారు. దేశంలో సమూల మార్పునకు సరైన వేదిక లోక్‌సత్తాయే అని ఆయన ప్రగాఢంగా విశ్వసించి పనిచేశారు.

ఉద్యమసంస్థ నాటి నుంచి లోక్‌సత్తాతో రామారావుకి అనుబంధం ఉందని, పోత్సాహకాలు లేని ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా తూర్పు గోదావరి జిల్లాలో లోక్‌సత్తా లక్ష్యాల కోసం చిత్తశుద్ధితో పనిచేశారని జేపీ నివాళులర్పించారు. రామారావు మృతి సమాజానికి, లోక్‌సత్తాకు లోటని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

# కలాం నూతన భారతదేశం కల నెరవేరటానికి 6 సూత్రాల తక్షణ రాజకీయ, పాలనా సంస్కరణలు

## లోక్‌సత్తా రౌండ్‌టేబుల్ సమావేశం కార్యాచరణ ప్రతిపాదన

దేశవ్యాప్తంగా కుల, మత, ప్రాంత, భాషలకతీతంగా అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షగా మారిన ఏపీజే అబ్దుల్ కలాం నూతన భారతదేశం కల సాకారం కావటానికి తక్షణం ఆచరణ సాధ్యమైన 6 సూత్రాల రాజకీయ, పాలనా సంస్కరణల్ని లోక్‌సత్తా ఉద్యమ రౌండ్‌టేబుల్ ప్రతిపాదించింది. 1) స్థానిక ప్రభుత్వాల సాధికారతతో పాటు ఏటా తలసరి రూ.1000 చొప్పున వార్డు స్థాయికి నిధుల కేటాయింపు 2) ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలందించేందుకు 'సర్వీస్ గ్యారంటీ' చట్టం, 3) అవినీతిపరుల ఆస్తులు జప్తు చేసే చట్టంతోపాటు రాష్ట్రాల్లో బలమైన, జవాబుదారీతనంగల లోకాయుక్త, వేగంగా న్యాయం అందించేందుకు స్థానిక కోర్టుల ఏర్పాటు-సివిల్, క్రిమినల్ కేసుల విచారణ విధానాల మార్పు-పోలీసు సంస్కరణలు, 4) విద్య, ఆరోగ్యరంగాలలో సమూల మార్పులు 5) మౌలిక వసతుల ఏర్పాటు 6) సివిల్ సర్వీసుల సమగ్ర ప్రక్షాళన వెంటనే చేపట్టాల్సినవని సమావేశం తీర్మానించింది. వీటితోపాటు కలాం కలలుగన్న నూతన భారతదేశం సాకారం కావటానికి ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం, అన్ని స్థాయిల్లో దామాషా ఎన్నికల పద్ధతి అమలు వంటి కీలక రాజకీయ సంస్కరణలు అవసరమని, అయితే వాటికి జాతీయస్థాయిలో ఏకాభిప్రాయం సాధించాల్సి ఉండటం, గతంలో కాంగ్రెస్‌లాగా బీజేపీ ఇప్పుడు ఓట్ల శాతం కంటే ఎక్కువ సీట్లు పొందుతున్న తరుణంలో దామాషా ఎన్నికల పద్ధతికి వారు అంగీకరించే అవకాశం తక్కువగా ఉండటం వల్ల ఆచరణ సాధ్యమైన 6 సూత్రాలకే పరిమితమవ్వాలని సమావేశం నిర్ణయించింది.

లోక్‌సత్తా ఉద్యమ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 3న 'కలాం కలలుగన్న నూతన భారతదేశం-అవరోధాల్ని ఛేదించేందుకు రాజకీయ, పాలనా సంస్కరణలు' అంశంపై ఫ్యాప్సీ హాల్‌లో లోక్‌సత్తా రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ రంగాలలో విశేష సేవలందించిన ప్రముఖులు పాల్గన్నారు. కలాంకు నివాళిగా రెండు నిముషాలపాటు మౌనం పాటించాక సమావేశం ప్రారంభమైంది.

రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయప్రకాష్ నారాయణ్ ప్రారంభిస్తూ, మంచి ఇంజిన్, సమర్థుడైన డ్రైవర్ ఉన్నా ట్రాక్ సరిగాలేనంత వరకూ రైలు ప్రయాణం సరిగా జరగదని, అలాగే మనదేశానికి సరైన దిశామార్గం లేకపోవటం వల్ల అధికారంలో ఎవరున్నా జనం జీవితాల్లో రావాల్సిన స్థాయి మార్పులు రావటం లేదని అన్నారు. ప్రపంచంలోని అనేకదేశాలలో చాలా సాధారణంగా జరిగే పనులు కూడా మనదేశంలో జరగటానికి విపరీతంగా శ్రమించాల్సి వస్తోందని, ఏళ్ల తరబడి సమయం పడుతోందని అన్నారు. వనరులు, నాయకత్వంతో పాటుగా విధానాలకు, వ్యవస్థల నిర్మాణానికి మనం ప్రాధాన్యత ఇచ్చినప్పుడే మనం ఆశించిన మార్పుల్ని దేశంలో సాధించగలమని, ఆ లక్ష్యంతోనే తరతరాల కృషిగా లోక్‌సత్తాను ఆగస్టు 3, 1997లో ప్రారంభించామని చెప్పారు. స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమానికి ప్రభుత్వ సంకల్పం, అందరి మద్దతూ ఉన్నా అది ప్రధాని ప్రసంగానికి, టీవీ యాడ్స్‌కి పరిమితం కావటానికి కారణం సరైన ట్రాక్ లేకపోవటమేనన్నారు. అందరూ కలాం కలలకు మద్దతుగా నిలుస్తున్నా అవి నెరవేరటానికి కూడా ఆ ట్రాక్ నిర్మాణం లేకపోవటమే అవరోధంగా ఉందన్నారు. కీర్తి ఎవరికి దక్కుతుంది అని కాకుండా ఈ దేశానికి ప్రజల చుట్టూ పాలనను అందించే వ్యవస్థల నిర్మాణం లక్ష్యంగా అధికారం, హింస, కల్లోల విప్లవాలు లేకుండా లోక్‌సత్తా చేసిన కృషి గత 20-30 ఏళ్లలో ప్రపంచంలోనే ఎవరూ సాధించని అద్భుత విజయాలను సాధించిందని, మన ప్రజాస్వామ్యం స్పందించే శక్తితో ఉన్నందున మార్పులు సాధించటం సాధ్యం అని నిరూపించిందన్నారు. కలాం గొప్ప ఆశావాదంతో ప్రతిపాదించిన వ్యవసాయం - ఆగ్రో ప్రాసెసింగ్, విద్య, ఆరోగ్యం, సమాచారం, సాంకేతికత, మౌలిక వసతులు, కీలక సాంకేతిక పరిజ్ఞానం అనే ఐదు లక్ష్యాలను సమావేశం

ప్రాతిపదికగా తీసుకుంటున్నట్టు జేపీ తెలిపారు.

వీటిలో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల విషయంలో భారత్ ఇంకా అథమస్థాయిలోనే ఉందని, రాజకీయంగా, పాలనాపరంగా అనేక అవరోధాలను అధిగమించాల్సి ఉందని జేపీ పేర్కొన్నారు. పాఠశాల విద్యాప్రమాణాలపై ప్రపంచ వ్యాప్తంగా 74 దేశాలలో సర్వే చేస్తే మనదేశం 73వ స్థానంలో ఉందని, ఈ వాస్తవం బైటపడటంతో సమాధానం చెప్పలేక ఇక ముందు ఆ సర్వేలో పాల్గనబోమని, ఎవరితో పోల్చుకోబోమని భారత్ పలాయనవాదాన్ని ఆశ్రయించిందన్నారు. విద్యా హక్కు చట్టాన్ని తెచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో చేరే వారి సంఖ్య 10శాతం తగ్గితే, ప్రయివేటు పాఠశాలల్లో చేరేవారి సంఖ్య 40శాతం పెరిగిందన్నారు. తాను వైద్యం చదివేరోజుల్లో ఏ సమస్యలున్నాయో అదే సమస్యలు ఈవేళ్టికీ ఆరోగ్యరంగంలో ఉన్నాయని, అందరికీ అందుబాటులో వైద్యం తెచ్చేందుకు బ్రిటన్ తరహాలో సార్వత్రిక ఆరోగ్య పథకాన్ని అమలుచేయటానికి పాలకులకు ధైర్యం చాలటం లేదన్నారు. లోక్‌సత్తా కృషితోనే 2009లో వచ్చిన స్థానిక కోర్టులతో సామాన్యులకు వేగంగా, చౌకగా న్యాయం అందే అవకాశం ఉన్నా, వాటికి కేంద్ర ప్రభుత్వమే ఆర్థికసాయం అందిస్తామన్నా రకరకాల సాకులతో పాలకులు చొరవ తీసుకోవటం లేదన్నారు. కేవలం రాజకీయ వ్యవస్థే కాకుండా వలస పాలన అవశేష భావాలలో, ప్రక్రియలో కూరుకుపోయిన అధికార యంత్రాంగం కూడా పలు సంస్కరణలను అడ్డుకోవటం సమస్యని జటిలం చేస్తోందన్నారు. స్థానిక ప్రభుత్వాల సాధికారతకు రాజ్యాంగ సవరణ వచ్చే అవకాశాలు లేవని, అందువల్ల తలసరి రూ.1000 కేటాయింపును ప్రతిపాదించటం మేలని, కేంద్రం నుంచి రాష్ట్రాలకు గ్రాంట్లు పెరిగినందున వాటిలో భాగంగా తలసరి గ్రాంట్‌ను ఇచ్చి, స్థానికంగా అంబుడ్స్‌మన్‌లని ఏర్పాటు చేయటానికి ఎవరికీ అభ్యంతరం ఉండదని అన్నారు.

**పాఠశాల విద్యాప్రమాణాలపై ప్రపంచ వ్యాప్తంగా 74 దేశాలలో సర్వే చేస్తే మనదేశం 73వ స్థానంలో ఉందని, ఈ వాస్తవం బైటపడటంతో సమాధానం చెప్పలేక ఇక ముందు ఆ సర్వేలో పాల్గనబోమని, ఎవరితో పోల్చుకోబోమని భారత్ పలాయన వాదాన్ని ఆశ్రయించిందన్నారు.**

సర్వీస్ గ్యారంటీ చట్టంపై గతంలో అనేక ప్రయత్నాలు చేశామని, అనేకసార్లు సమావేశాలు నిర్వహించామని, వాటన్నిటినీ క్రోడీకరించి తయారుచేసిన బిల్లు పార్లమెంటు ముందుందని జేపీ తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ వైఫల్యం దిశగా సాగుతుండటానికి అధికార యంత్రాంగం వైఫల్యమే కారణమని, వారిని శాసించే ధైర్యం ప్రభుత్వాలకు లేదని, జాతీయస్థాయి అధికార వ్యవస్థను ప్రక్షాళన చేయాలని అన్నారు. ఎలా పనిచేసినా రిటైరయ్యేవరకూ పదవిలో కొనసాగుతామనే పరిస్థితిని మార్చాలని, పదవిలో కొనసాగే కాలవ్యవధిని కుదించటం, ప్రమోషన్లు బ్యాచీలవారీగా కాకుండా అర్హులకే ఇవ్వటం, సమర్థులైనవారిని పౌరసమాజం నుంచి కూడా నిర్ణీత కాలవ్యవధి వరకూ అధికారులుగా తీసుకోవటం వంటి మార్పుల్ని తీసుకురావాలన్నారు. అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లులో 17 (ఎ) సెక్షన్ పేరుతో ఏసీబీ, సీబీఐలని మరింత బలహీనపరుస్తున్నారని, దీనివల్ల అవినీతి నేరాల కేసుల్ని చేపట్టటమే కష్టమవుతుందని హెచ్చరించారు. అన్నిటికీ ప్రయివేటు రంగమే పరిష్కారమన్న ధోరణి దీర్ఘకాలంలో ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుందని, చట్టబద్ధ పాలన, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు వంటి రంగాలలో ప్రభుత్వం నిర్వర్తించాల్సిన పాత్రకు ప్రత్యామ్నాయం ఉండదని అన్నారు. లోక్‌పాల్‌పై పలువురు జాతీయస్థాయి నిష్ణాతులతో, ప్రముఖులతో ఢిల్లీలో, హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం తర్వాత లోక్‌సత్తా ఇచ్చిన అంశాలు లోక్‌పాల్ చట్టంలో పొందుపరిచారని, సర్వాధికారిలాగా లోక్‌పాల్ ఉండాలన్న అన్నా హజారే బృందం వాదని తప్పని ఆనాడు లోక్‌సత్తా చేసిన వాదన ఈరోజు కర్ణాటక లోకాయుక్త విషయంలో రుజువైందని అన్నారు.

తమిళనాడు మాజీ గవర్నర్ పి.ఎస్ రామ్మోహనరావు మాట్లాడుతూ, పెద్దల తరాన్ని మార్చటం కష్టమని భావించే కలాం యువతనుద్దేశించే నినాదాలిచ్చారని, వారినే నమ్ముకున్నారని అన్నారు. చట్టసభ సభ్యులకు నైతిక ప్రవర్తనా నియమావళి ఉండాలని, ఆ పరిధి దాటాకే వారిని లోక్‌పాల్, లోకాయుక్తల పరిధిలోకి వచ్చే ఏర్పాటు ఉంటే ఈవేళ సుష్మా స్వరాజ్ ఉదంతంలోలా అనుచిత ప్రవర్తన అంశాలపై పార్లమెంటును స్తంభింపచేయటం వంటి సమస్యలు తలెత్తవని అన్నారు. మాజీ విజిలెన్స్ కమిషనర్ సీఆర్ కమలనాథన్ మాట్లాడుతూ, మనదేశంలో ప్రతి కొత్త ప్రయత్నాన్నీ తంతులాగా తయారుచేస్తున్నారని, న్యూస్‌పేపర్ హెడ్‌లైన్స్‌లాగా రేపు మరో కొత్త విషయం అవసరమన్నట్టు వ్యవహరిస్తున్నారని, లోక్‌సత్తా,

ఎఫ్‌డీఆర్ చెబుతున్న విషయాలను అమలులోకి తెస్తే దేశానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య ఉద్యోగుల విషయంలో సరైన సమాచారమే లేదని, పారదర్శకంగా చేయటానికి చాలా సమయం పడుతోందని, అనవసరంగా ఈ పని తలకెత్తుకున్నానన్న భావన కలుగుతోందని ఛలోక్తి విసిరారు. లోక్‌సత్తా చేపట్టిన ఈ సమావేశం ఎజెండా చాలా విస్తృతమైనదని, మరిన్ని సమావేశాలు జరగాలని, ఈ లక్ష్యాల సాధనకు పూర్తి మద్దతిస్తామని మాజీ మంత్రి, సీబీఐ మాజీ డైరెక్టర్ విజయరామారావు చెప్పారు.

జస్టిస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, రాజకీయం, పాలన, న్యాయవ్యవస్థలు విఫలమవుతున్నాయన్న భావన ప్రజల్లో కలుగుతోందని, దీన్ని సరిచేయటానికి దీర్ఘకాలిక సంస్కరణలతోపాటు తక్షణం కొన్ని ఫలితాలను సాధించే ప్రయత్నాల్ని ముమ్మరం చేయాలని సూచించారు. దేశంలో సివిల్ కేసుల కంటే క్రిమినల్ కేసులు పెరిగిపోవటం ఆందోళనకరమని, పోలీసు సంస్కరణలకు ముందు న్యాయసంస్కరణలు కావాలని మాజీ ఐపీఎస్ అధికారి ఆంజనేయ రెడ్డి అన్నారు. నేరదర్యాప్తు న్యాయవ్యవస్థ పరిధిలో ఉండకూడదని, అయితే దర్యాప్తును పర్యవేక్షించేవారు లోక్‌పాల్‌లో సభ్యులుగా ఉండవచ్చన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఒక స్పీకర్ పంచిన రూ.21 లక్షల డబ్బు పట్టుబడితే కోర్టు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిందని, రూ.30వేలు వడ్డీగా తీసుకుందని, విశ్వవిద్యాలయ ఉపకులపతి పదవికి మంత్రి రూ.3కోట్లు డిమాండ్ చేశారని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ వ్యవస్థాపకుడు పద్మనాభరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజ్ఞాభారతి ఛైర్మన్ హనుమాన్ చౌదరి మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్ల లక్ష్యం పేదరికాన్ని తొలగించటం కావాలితప్ప కొనసాగించటం కాకూడదన్నారు. 1955లో తెలుగునాట జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో రూ.800 ఖర్చుతో అభ్యర్థి నెగ్గారని, ఇప్పుడు రూ. 10 కోట్లు సర్వసాధారణమై పోయిందని, దామాషా ఎన్నికల పద్ధతే దేశ సమస్యలకు పరిష్కారమని మాజీ ఎంపీ ప్రొఫెసర్ లక్ష్మన్న అన్నారు. విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు కులసంఘాలుగా మారితే కలాం కలలు ఎలా నెరవేరతాయని కళానిధి సత్యనారాయణ ప్రశ్నించారు.

లోక్‌సత్తా గత 18ఏళ్లుగా సాధించిన ఈ దిగువ విజయాలను జేపీ పవర్ పాయింట్ ద్వారా వివరించారు:

(1) పెట్రోలు బంకుల్లో తూనికల మోసాన్ని చాలావరకు అరికట్టటం (2) ఓటర్ల జాబితాల ప్రక్షాళన (3) అభ్యర్థుల నేరచరితని, ఇతర వివరాలని ప్రకటించే చట్టం (2003) (4) పార్టీల విరాళాలలో పారదర్శకతని తెచ్చే చట్టం (2003) (5) పరోక్ష పన్నుల (సెంట్రల్ ఎక్సయిజ్, కస్టమ్స్) సేకరణలో కీలక సవరణలు (6) పార్టీ ఫిరాయింపు నిషేధాన్ని బలోపేతం చేసే రాజ్యాంగ సవరణ (91వ సవరణ) (7) మంత్రివర్గ సభ్యుల సంఖ్యని కుదించే ఏర్పాట్లు (91వ సవరణ) (8) పాలనా సమాచార హక్కు చట్టం (2005) (9) జాతీయ ఆరోగ్య మిషన్ (2005) (10) స్థానిక న్యాయాలయాల చట్టం (2009) (11) సహకార సంఘాల స్వయంప్రతిపత్తి (97వ రాజ్యాంగ సవరణ – 2012) (12) 2 జీ – స్పెక్ట్రం లైసెన్సుల రద్దు – సహజ వనరుల వేలం పాట విధానం (2013) (13) లోక్‌పాల్ చట్టం (2014) (14) ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం జాతీయ జ్యుడీషియల్ నియామకాల కమిషన్ (శ్రీఅజ్పు – 2014). ఇప్పుడు విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలు, చట్టబద్ధమైన పాలన, న్యాయవ్యవస్థ – పోలీసు సంస్కరణలు, ప్రభుత్వ సేవలు సకాలంలో అందే చట్టం, రాజకీయ సంస్కరణలు – ఈ రంగాలలో మరిన్ని మౌలిక మార్పుల కోసం లోక్‌సత్తా కృషిచేస్తోందని, వచ్చి పోయే లాంతర్లక ప్రభావాలకు లోనుకాకుండా దూరనక్షత్ర కాంతులతో మార్గాన్ని ఏర్పరుస్తూ ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం లోక్‌సత్తా పోరాటాన్ని కొనసాగిస్తుందని జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

2 జీ కుంభకోణంలో దేశవ్యాప్తంగా ప్రముఖులను కూడగట్టి లోక్‌సత్తా దాఖలు చేసిన పిటిషన్ వల్ల ఈరోజు బొగ్గు, స్పెక్ట్రం వంటి ప్రకృతి వనరులకు వేలం పాట జరిగి తాజాగా లక్షల కోట్ల ఆదాయం ప్రజా ఖజానాకు సమకూరిందని తొలుత సమావేశానికి స్వాగతం పలికిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఎన్. శ్రీనివాస్ అన్నారు.

సమావేశంలో ఇంకా డా॥ కొండలరావు, నీటిపారుదల శాఖ మాజీ చీఫ్ ఇంజినీర్ ధర్మారావు, విద్యావేత్త అన్వర్ ఖాన్ ప్రసంగించారు. ఎం.కృష్ణారెడ్డి, బి.రఘునాథరెడ్డి, వి.వి రావు, పి. భాస్కరరావు, నిస్సార్ ఫాతిమా, ఎస్.కె రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ■

# కేసీఆర్ గారూ! చంద్రబాబుకి భయపడుతున్నారా? డీల్ కుదిరిందా?

## - ఓటుకు కోట్లుపై సీఎం క్యాంప్ ఆఫీసు వద్ద లోక్‌సత్తా నిరసన -




మండలి ఎన్నికలో ఓటుకు కోట్లు కేసులో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమేయం స్పష్టంగా కనిపిస్తున్నా ఆయనపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తగుచర్యలు తీసుకోకుండా తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు మోకాలడ్డుతున్నట్టు కనిపిస్తోందని లోక్‌సత్తా పార్టీ పేర్కొంది. "కేసీఆర్ గారూ! తనపై విచారణ చేపడితే మీ ప్రభుత్వాన్ని కూల్చేస్తానని హెచ్చరించిన చంద్రబాబు గారికి భయపడుతున్నారా? లేక చంద్రబాబుగారితో డీల్ కుదుర్చుకుని ఏసీబీని కట్టడి చేస్తున్నారా?'' అని లోక్‌సత్తా నేతలు ప్రశ్నించారు.

**ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబు నాయుడు సహా పలువురిపై ప్రాథమిక సాక్ష్యాధారాలున్నా విచారణ సక్రమంగా జరగకపోవటాన్ని నిరసిస్తూ లోక్‌సత్తా నేతలు తెలంగాణ సీఎం క్యాంప్ ఆఫీస్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు.**

ఈ సందర్భంగా **లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోల్కర్ రెడ్డి మాట్లాడుతూ,** ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినా, ఆ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలిఫోన్ సంభాషణ బైటపడినా విచారణ నత్తనడకన సాగుతోందని, ఇందుకు కేసీఆర్ వైఖరే కారణమని అన్నారు. ఫోన్ సంభాషణలో ఉన్న గొంతు తనది కాదు అని ఇప్పటికీ చంద్రబాబు చెప్పలేదని, అయినా ఆయన గొంతును తీసుకుని వాస్తవాల్ని నిగ్గుతేల్చే ప్రయత్నం చేయటం లేదన్నారు. నా ఏసీబీ, నా పోలీసులు అంటున్న కేసీఆర్ చంద్రబాబుతో లాలూచీ పడో, లేక నా జోలికొస్తే తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చేస్తానంటున్న చంద్రబాబును చూసి భయపడో ఏసీబీ విచారణను అడ్డుకుంటున్నారన్నారు. ఇది ముఖ్యమంత్రుల సొంత వ్యవహారం కాదని, వాస్తవాల్ని వేగంగా నిగ్గుతేల్చి దోషుల్ని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఇంత బహిరంగంగా సాక్ష్యాలు బైటపడ్డ కేసులో కూడా విచారణ సక్రమంగా జరగకుండా ఉంటే, ఇక ఎవరూ చట్టాన్ని లెక్కచేయరని, అరాచకత్వం రాజ్యమేలుతుందని అన్నారు.

**లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దోసపాటి రాము, బొంతు సాంబిరెడ్డి మాట్లాడుతూ,** నా ఏసీబీ, నా పోలీసులు అంటున్న సీఎంల వల్లే ఈ కేసు విచారణ సరిగా సాగటం లేదని, ఏసీబీకి స్వయంప్రతిపత్తి కల్పించి బలమైన లోకాయుక్త పరిధిలోకి తేవాలని, ఓటుకు కోట్లు కేసుపై లోక్‌పాల్ పర్యవేక్షణలో సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 8కి, ఈ కేసుకి సంబంధం లేకపోయినా స్వార్థ ప్రయోజనాల కోసం సెక్షన్ 8 పేరుతో తెలుగు ప్రజల మధ్య సీఎంలు చిచ్చుపెడుతున్నారన్నారు.

లోక్‌సత్తా నేతలు గజానని, కిషోర్, రామచందర్, సురేంద్ర, గంగాభవాని, లావణ్య, భవాని, బాబూరావు, వంశీ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, రాఘవయ్య, ప్రసాద్, సంతోష్, పవన్, సత్యనారాయణ, సూర్యలక్ష్మి, వెంకటేష్, కొండల్‌రెడ్డి, చిరంజీవి, నరేంద్రరెడ్డి, సుబ్రమణ్యం, హసన్, శివరామకృష్ణ, విమల, వినోద్, రామన్న, సత్యపాల్, వంశీ, విపుల్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు. ■

# ప్రభుత్వం వైద్య కళాశాల కోసం లోక్‌సత్తా ఆందోళన



## విజయనగరం

అన్ని విషయాలలో వెనుకబడిన విజయనగరం జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసి కాంప్లెక్ వరకు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంప్లెక్స్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ జిల్లాకు ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరులు చేయడం వల్ల బోధన ఆసుపత్రులు ఏర్పాటుకు అవకాశం ఏర్పడి ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని అన్నారు. ప్రభుత్వం తలచుకుంటే ప్రభుత్వవైద్య కళాశాల ఏర్పాటు చేయడం సులభమేనని, కళాశాల ఏర్పాటుకు అవసరం అయిన స్థలం జిల్లా కేంద్ర ప్రభుత్వం ఆసుపత్రి, ఘోషా ఆసుపత్రి ప్రాంతాల్లో అందుబాటులో ఉందని తెలిపారు. ప్రభుత్వ కళాశాల కోసం ప్రజలను కదిలిస్తామని, కళాశాల కోసం చేసే ఉద్యమంలో యువతను భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మునాయుడు, అల్లం ప్రభాకర్, సింహాచలం, ధనుంజయ, రమణ తదితరులు పాల్గొన్నారు.

# జిందాల్ భూసేకరణ అక్రమాలపై విచారణకు పిలుపు




## శృంగవరపుకోట

శృంగవరపు కోట మండలం బొడ్డవర ప్రాంతంలో జిందాల్ కర్మాగారం ఏర్పాటుకు జరిగిన భూసేకరణ అక్రమాలపై విచారణకు సాక్షులుగా హాజరు కావాలంటూ తనతో పాటు పి.కె.వి.ఎస్.ఎస్.పి. వర్మ, దొడ్డి సూర్యారావులకు కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్ డా॥ప్రేమ్‌చంద్ నోటీసులు పంపారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ తెలిపారు. ఈ కేసులో అక్రమాలకు కారకులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ ఉద్యోగులు నలుగురికి కూడా నోటీసులు జారీ చేశారన్నారు. వీరిలో అప్పటి ఆర్డీఓ, ప్రస్తుతం గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న సహాయకుడు సి.హెచ్. బంగార్రాజు, అప్పటి వీఆర్వోగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన డి. సన్యాశినాయుడులకు కూడా నోటీసులు వచ్చాయన్నారు.

2008 సం॥ నుంచి లోక్‌సత్తా జిందాల్ భూసేకరణ అక్రమాలపై పోరాటం చేస్తుందని 2008 సెప్టెంబర్ 22న స.హ. చట్టం కింద వివరాలు సేకరించి 12 మంది బినామీలకు రూ.35 లక్షల వరకు చెల్లింపులు చేశారని గుర్తించామన్నారు. అంతకుముందు మొత్తం 1048 ఎకరాలు సేకరించడం ద్వారా చెల్లింపులు చేసిన రూ. 22.42 కోట్లలో పలు అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేశామన్నారు. లోక్‌సత్తా అధినేత డా॥ జయప్రకాష్ నారాయణ్ జిందాల్ భూసేరణ జరిగిన ప్రాంతాల్లో పర్యటించి బాధితుల నుంచి వివరాలు సేకరించి అసెంబ్లీలో లేదనెత్తారన్నారు. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్ ను కూడా కలిసి ఫిర్యాదు చేశామన్నారు. లోకాయుక్తకు ఫిర్యాదు చేశామన్నారు. ఎట్టకేలకు కమిషనర్ ఆఫ్ ఎంక్వయిరీస్‌ను నియమించారన్నారు. ఎ.సి.బి. ఈ విషయంలో ప్రాథమిక దర్యాప్తు చేసి వదిలేసిందని, పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమన్నారు. విచారణకు హాజరై అక్రమాలకు సంబంధించి వివరాలన్నీ కమిషన్ ముందు పెడతామన్నారు. జిందాల్ భూ సేకరణ అక్రమాలపై ప్రతిపక్షంలో ఉండి పెద్దఎత్తున పోరాటం చేసిన తెదేపా నాయకులు ఇప్పుడు మాట్లాడడం లేదన్నారు. దీనిపై కనీసం అసెంబ్లీలో కూడా ప్రస్తావించలేదన్నారు. అప్పుడు కనిపించిన అక్రమాలు ఇప్పుడు తెదేపా నాయకులకు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మైనింగు ఇంజినీరు ఆర్. సుధాకర్ మండల కన్వీనరు కె. ప్రసాదు, కె.కృష్ణారావు, దాసు మాస్టారు, ఎ.పద్మాకర్, రామేశ్వర్రావు, యు.వి. జాక్సన్ తదితరులు పాల్గొన్నారు. ■

**గమనిక:**

లోక్‌సత్తా టైమ్స్ పక్ష పత్రిక కొన్ని అనివార్యకారణాల వలన ఇటీవల వెలువరించలేకపోయినందుకు విచారిస్తున్నాం. పాఠకులు గమనించగలరు.

– ఎడిటర్

ಲೋಕಸತ್ತಾ ಪಕ್ಷ

**LOKSATTA PARTY**

ನಮ್ಮ

# ಭರವಸೆಯ ಭವ್ಯ ಬೆಂಗಳೂರು

ಸ್ವಚ್ಛ-ಸುಂದರ-ಸದೃಢ-ಸಮೃದ್ಧ-ಸ್ಮಾರ್ಟ್ ನಗರಕ್ಕಾಗಿ
ಲೋಕಸತ್ತಾ ಪಕ್ಷದ ಅಭ್ಯರ್ಥಿಗಳು

LOKSATTA CANDIDATES FOR,

# A CLEAN, GREEN, STRONG, PROSPEROUS AND SMART BENGALURU



**Surendra Srivastava**
National President



**Aruna Kumari G.N., BSc, MCA**
Software Engineer & Entrepreneur
#2, Chowdeshwari



**Dr Neetha Giridhara, BDS**
Dentist and Social Worker
#5, Jakkur



**Rajesh Babu, BE**
Engineer and Green Entrepreneur
#45, Malleshwaram



**K. Shantha Kumar**
Data Management Professional &
Yoga Instructor, #65, Kadu Malleshwara



**Prakash R, (BSc)**
Businessman & Social Worker
#93, Vasanthnagar



**Syed Noorulla, BCom**
Junior Manager
#144, Siddapura



**Phanisai Bharadwaj, MBA**
HR Professional
#154, Basavanagudi



**Rohit Simha, BE, MS**
Quality Manager
#163, Kathriguppe



**Shilpa P., MBA/HR Melbourne**
Software & Green Entrepreneur
#166, Karisandra



**Lakshmi Moola, BSc**
Psychologist & HR Professional
#168, Pattabhiramanagar



**Dr. Kodur Venkatesh, MA, PhD**
Strategic Affairs Analyst
#170, Jayanagar East



**Maithreyi Nadapana, Bcom, PG Dip**
Multimedia Professional &
Child Safety Activist, #174, HSR Layout



**Balakrishna N.S., B.Tech**
Engineering Manager
#176, BTM Layout



**Dr. Banu Prakash, MBBS, MS, MCh**
Neurosurgeon & Spine Surgeon
#181, Kumaraswamy Layout



**Ravikiran Kamble, BArch**
Architect & Urban Designer
#185, Yelachenahalli



**Rajeshwari Doddamani, MCom, MA, BEd**
Educationist & TV News Presenter
#186, Jaraganahalli

Posting Date 22-9-2015
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on September 16th, 2015



లోక్‌సత్తా ఉద్యమ 18వ వార్షికోత్సవ సమావేశంలో డా॥ జయప్రకాష్ నారాయణ్

| Book-Post<br>PRINTED MATTER | To, |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad